జాతీయ రహదారి గుంతలను పూడ్చివేసిన ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి

- ఈనాడు ఆఫీస్ జంక్షన్ వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు
- ఎస్పీ ఆదేశాలతో తక్షణ స్పందన

సూర్యాపేట, నవంబర్ 11: ఉదయం ప్రతినిధి



సూర్యాపేట పట్టణ పరిధిలోని జాతీయ రహదారి-65పై ఈనాడు ఆఫీస్ జంక్షన్ వద్ద ఏర్పడిన గుంతలు వాహనదారులకు ప్రమాదకరంగా మారాయి. ఈ విషయాన్ని గుర్తించిన జిల్లా ఎస్పీ కె. నరసింహ, ఐపీఎస్ ఆదేశాల మేరకు సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి తక్షణ చర్యలు చేపట్టారు. మంగళవారం ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు జాతీయ రహదారుల సంస్థ (ఎన్ హెచ్ ఎ ఐ) అధికారులతో సమన్వయం చేసుకొని, సిబ్బంది సహకారంతో రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చివేయించారు. వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. వాహనదారులు రహదారులపై ప్రయాణించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, వేగాన్ని నియంత్రించుకొని నిదానంగా వాహనాలు నడపాలని సూచించారు. రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షిత ప్రయాణం చేయాలని కోరారు.

ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని ఓటర్లు నవంబర్ 20లోగా దరఖాస్తు చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

నల్గొండ, ఉదయం ప్రతినిధి



ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) కార్యక్రమంలో భాగంగా వివిధ కారణాలతో ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని, గైర్హాజరైన, శాశ్వతంగా చిరునామా మారిన ఓటర్లకు ఈ నెల 20వ తేదీలోగా నిర్దేశిత అనుబంధ ఫారంలో దరఖాస్తు చేసుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో SIR, వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. గతంలో వివిధ కారణాలతో ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని వారికి మరోసారి అవకాశం కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు. ఫారాలు సమర్పించని ఓటర్ల వివరాలను ఇప్పటికే కేటగిరీల వారీగా బూత్ స్థాయి అధికారులకు (BLOలు) పంపించామని, ఆ జాబితాలను బూత్ స్థాయి ఏజెంట్ల (BLAలు) ద్వారా గ్రామాల్లో మరోసారి చదివించి, అర్హులైన వారు ఫారాలు సమర్పించేలా చూడాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. ఇప్పటికే ఓటరుగా నమోదైన వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని, ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని వారు మాత్రమే నవంబర్ 20లోగా ఎన్నికల సంఘం నిర్దేశించిన అనుబంధ ఫారంలో దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లాలో మొత్తం 1,58,630 ఎన్యుమరేషన్ ఫారాలు సేకరించలేదని, ఇందులో 32 వేల మంది మరణించినట్లు, 1.44 లక్షల మంది శాశ్వతంగా చిరునామా మారినట్లు, 18 వేల మంది ఇప్పటికే మరోచోట ఓటర్లుగా నమోదైనట్లు, 6,978 మంది గైర్హాజరు ఓటర్లుగా, 182 మంది ఇతర కేటగిరీలో ఉన్నట్లు వివరించారు. శాశ్వతంగా చిరునామా మారినవారు, గైర్హాజరు ఓటర్లు మాత్రమే ఈ నెల 20లోగా నిర్దేశిత ఫారంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ అంశంపై విస్తృత ప్రచారం నిర్వహించి, అర్హులైన వారందరికీ తిరిగి ఓటరుగా నమోదయ్యే అవకాశంపై అవగాహన కల్పించాలని సూచించారు. వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు జాబితాకు సంబంధించి ఫారం-18 ద్వారా ఓటరు నమోదుకు నవంబర్ 6 చివరి తేదీ అయినప్పటికీ, ఈ నెల 25 నుంచి డిసెంబర్ 10 వరకు నిర్వహించే అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణ సమయంలోనూ ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. అలాగే డిసెంబర్ 30 తర్వాత కూడా ఈ నియోజకవర్గంలో ఓటరుగా నమోదు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రాలు, ఇప్పటివరకు అందిన ఫారం-18 దరఖాస్తులు తదితర వివరాలను జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ముంతాజ్, బీజేపీ నుంచి పి. లింగస్వామి, సీపీఐ(ఎం) నుంచి నర్సిరెడ్డి, బీఆర్ఎస్ నుంచి బి. పిచ్చయ్య, ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి డాక్టర్ ఎస్.కె. అన్సారి, టీడీపీ నుంచి తేలు అన్నా రవి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, డీటీ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

బహిరంగ సభ గోడ పోస్టర్ ఆవిష్కరణ

దమ్మపేట నవంబర్ 11 (ఉదయం ప్రతినిధి):



ఈనెల 15. తారీకు నుండి 18 వ రకు నల్ల గొండ పట్టణంలో జరుగుతున్న అఖిల భారత రైతుసంఘం. ఏఐకేఎస్ 36 వ జాతీయ మహాసభలు ను. 15 న జరిగే రైతాంగం ప్రదర్శన రెడ్ షర్టు వాలంటీర్లు ప్రదర్శన చేయాలని. తెలంగాణా రైతుసంఘం. సిఐటియూ. వ్యవసాయ కార్మిక సంఘం మండలం నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డాలక్ష్మి నారాయణ. సంఘం జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడీ శ్రీనివాసరావు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్. లు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రైతులు ఎదొర్కుంటున్న సమస్యలు పరిష్కారం కోసం. అఖిల భారత కిసాన్ సభ ఏఐకేఎస్. గత 90. సంవత్సరాల నుండి నిరంతరం కృషి చేస్తూ ఉందన్నారు. మహాసభలు ముందు రోజున 15. న నల్లగొండ పట్టణంలో జరిగే లక్ష లాది మంది రైతులు భారీగా జరిగే ప్రదర్శన బహిరంగ సభ ను జయప్రదం చేయాలని. రాజకీయాలు కు అతీతంగా పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు . ఈ కార్యక్రమంలో. సిఐటియు మండల కన్వీనర్.మురహరి రఘు. జిసిసి హమాలీ మేస్త్రి బొగ్యం సత్యం. రైతు నాయకులు. గడ్డిపాటి సత్య నారాయణ. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొలిక పోగు శ్రీనివాసరావు. జిసిసి హమాలీలు వెంకటయ్య, నాగేశ్వరరావు. శ్రీనివాస. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జనం మధ్య సెల్ గండం - తొలగించేదెప్పుడు?

- కుసుమవారిగూడెంలో కాలనీవాసుల ఆందోళన
- రేడియేషన్ భయంతో ధర్నా

సూర్యాపేట, నవంబర్ 11: ఉదయం ప్రతినిధి



జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన సెల్ ఫోన్ టవర్ ను వెంటనే తొలగించాలని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 8వ వార్డు కుసుమవారిగూడెం కాలనీవాసులు డిమాండ్ చేశారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో తమ ఆవేదనను వ్యక్తం చేస్తూ కాలనీవాసులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ... గతంలో పలుమార్లు కలెక్టర్, మున్సిపల్, పోలీసు అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. టవర్ ఏర్పాటు చేయవద్దంటూ తాము ధర్నా చేస్తే మాత్రం పావుగంటలోనే పోలీసులు వచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కాలనీలో చిన్నపిల్లలు, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారు ఉన్నారని, సెల్ టవర్ నుంచి వెలువడే రేడియేషన్ ప్రభావంపై ఆందోళన చెందుతున్నామని తెలిపారు. ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని అధికారులు స్పందించాలని కోరారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ పోతురాజు ఇందుశ్రీ అనిల్ మాట్లాడుతూ... సెల్ టవర్ ఏర్పాటు చేయాలనుకుంటే జనావాసాల మధ్య కాకుండా ప్రజలకు ఇబ్బందులు లేని ప్రాంతంలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కాలనీవాసుల ఆందోళనను అధికారులు పరిగణనలోకి తీసుకొని సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో రవీందర్ (ఆర్ఎంపీ), రమాదేవి, యూసుఫ్ బి, సుల్తానా, వసీమా, నజీర్, రాములు, రవీందర్ రెడ్డి, పిట్టల వెంకన్న, గోపాల్ రెడ్డి, నాగేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భగవాన్ బిర్సా ముండా 151వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం

బిజెపి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు

ఖమ్మం ఉదయం బ్యూరో



సెప్టెంబర్ 11 జిల్లా అధ్యక్షుడు తాజ్ నోత్ భద్రం అధ్యక్షతన నవంబర్ 15న గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా 151వ జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లాలో చేపట్టే వివిధ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో బిజెపి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం '75 ఏళ్ల ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా 2021 నుండి బిర్సా ముండా జయంతిని జాతీయ గిరిజన గౌరవ దినోత్సవంగా (జన్‌జాతీయ గౌరవ్ దివస్) దేశవ్యాప్తంగా అధికారికంగా నిర్వహిస్తోందని గుర్తుచేశారు. గిరిజన నాయకుల గొప్ప చరిత్రను, వారి పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందిస్తూ, గిరిజన సంస్కృతి సంప్రదాయాలను బిజెపి ప్రభుత్వం పరిరక్షిస్తోందని స్పష్టం చేశారు. సమావేశానికి అధ్యక్షత వహించిన తాజ్ నోత్ భద్రం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బిర్సా ముండా జయంతి ఉత్సవాలను పండుగ వాతావరణంలో అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

గిరిజన సంక్షేమాన్ని విస్మరించిన రాష్ట్ర ప్రభుత్వం:

గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యామ్ రాథోడ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో గిరిజన మహిళలకు రక్షణ కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజన సంక్షేమంపై ప్రస్తుత ప్రభుత్వం కల్లిబొల్లి మాటలు తప్ప ఏమీ చేయడం లేదని విమర్శించారు. బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు రవి రాథోడ్ మాట్లాడుతూ ఎన్నికల వేళ ఇచ్చిన 'చేవెళ్ల డిక్లరేషన్'ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ శాఖ ద్వారా ప్రత్యేక నిధులు కేటాయించి, గిరిజనుల అభ్యున్నతికి చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన పోరాట యోధుల చరిత్రలను ప్రజల్లోకి తీసుకెళ్లి యువతలో స్ఫూర్తి నింపాలని, నిరుద్యోగ సమస్యతో గిరిజన యువత తప్పుదారి పట్టకుండా ప్రభుత్వం బాధ్యత వహించాలని సూచించారు. ఈ ప్రెస్ మీట్‌లో పార్టీ సీనియర్ నాయకులు మందడపు సుబ్బారావు, గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శులు రమేష్, రాహుల్, నాయకులు శ్రీకృష్ణ, సాయిరాం, వీరభద్రం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఘనంగా జాతీయ విద్యా దినోత్సవ వేడుకలు

మధిర, నవంబర్,11, ఉదయం, ప్రతినిధి:




భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ విద్యావేత్త మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ విద్యా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రవీంద్రారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ జి. అరుణ, అధ్యాపకులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రవీంద్రారెడ్డి మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా దేశ విద్యావ్యవస్థ అభివృద్ధికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ విశేష కృషి చేసి విద్యారంగ పటిష్టతకు పునాదులు వేశారని కొనియాడారు. విద్య ఉద్యోగ సాధనకే కాకుండా వ్యక్తిత్వ వికాసానికి, సమాజ అభివృద్ధికి, దేశ పురోగతికి కీలకమైన సాధనమని పేర్కొంటూ విద్యార్థులు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతతో ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ జి. అరుణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య అందించాలనే ఆజాద్ ఆశయాలు నేటికీ స్ఫూర్తిదాయకమని, మహిళా విద్య, ఉన్నత విద్యాభివృద్ధికి ఆయన విశేష ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. విద్యార్థులు తమకు లభించిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని నిరంతర అభ్యాసంతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎస్. ఇందిర, డాక్టర్ పి.సుజాత, డాక్టర్ వి.నాగరాజు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

చారిత్రక కట్టడాలు, దేవాలయాల పరిరక్షణ అందరి బాధ్యత

- కలెక్టర్ బి. చంద్రశేఖర్
- పానగల్ ఛాయా సోమేశ్వర ఆలయంలో హెరిటేజ్ వాక్ ప్రారంభం

నల్గొండ, ఉదయం ప్రతినిధి:



పురాతన, చారిత్రాత్మక కట్టడాలు, దేవాలయాలను భావితరాలకు అందించేలా సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. బుధవారం ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ (INTACH) తెలంగాణ చాప్టర్ ఆధ్వర్యంలో నల్గొండ సమీపంలోని పానగల్‌లో ఉన్న ప్రసిద్ధ ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయం వద్ద నిర్వహించిన 'హెరిటేజ్ వాక్' (వారసత్వ నడక) కార్యక్రమాన్ని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయం ఎంతో ప్రసిద్ధి చెందిన చారిత్రక ఆలయమని, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు, పర్యాటకులు ఈ ఆలయాన్ని సందర్శించేందుకు వస్తుంటారని తెలిపారు. 12వ శతాబ్దంలో కాకతీయుల కాలంలో ఈ దేవాలయం నిర్మితమైనట్లు చరిత్ర ద్వారా తెలుస్తోందన్నారు.

హెరిటేజ్ వాక్ ద్వారా ఆలయ చరిత్ర, విశిష్టత గురించి మరింత తెలుసుకునే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ఇలాంటి పురాతన కట్టడాలు, చారిత్రక నిర్మాణాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇటీవల ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి బడ్జెట్ కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇంటాక్ సంస్థ ఆధ్వర్యంలో ఈ ఆలయం వద్ద హెరిటేజ్ వాక్ నిర్వహించడం సంతోషకరమని తెలిపారు. అంతకుముందు కలెక్టర్ ఇంటాక్ ప్రతినిధులతో కలిసి ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టతను, గర్భగుడిలోని శివలింగంపై ఏర్పడే నీడ ప్రత్యేకతను ప్రత్యక్షంగా పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇంటాక్ న్యూఢిల్లీ చైర్మన్ అశోక్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ పురాతన కట్టడాలను పునరుద్ధరించడం, వాటి చారిత్రక ప్రాధాన్యతను కాపాడుతూ సంరక్షించడం ఇంటాక్ సంస్థ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. నల్గొండ ఇంటాక్ చాప్టర్‌ను ప్రారంభించే ఉద్దేశంతో జిల్లాకు వచ్చి ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించడం ఆనందంగా ఉందన్నారు. ఈ ఆలయ పరిరక్షణకు ఇంటాక్ సంస్థ తనవంతు కృషి చేస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హెరిటేజ్ డైరెక్టర్ అర్జున్ రావు, వెద్ కుమార్, సజ్జాద్ సాహిది, ధనుంజయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖో-ఖో క్రీడలకు మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల కళాశాల విద్యార్థుల ఎంపిక



ఇద్దరు విద్యార్థులకు రాష్ట్రస్థాయి పోటీల్లో అవకాశం

చిలుకూరు, నవంబర్ 11 (ఉదయం):

మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల కళాశాల చిలుకూరుకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి అండర్-17 ఖో-ఖో క్రీడలకు ఎంపికయ్యారు. ఈ నెల 10వ తేదీ మంగళవారం నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా అండర్-17 ఖో-ఖో పోటీల్లో సూర్యాపేట జిల్లా జట్టు ప్రథమ బహుమతి సాధించింది. ఈ జట్టులో ప్రతిభ కనబరిచిన కళాశాల విద్యార్థులు కె. రంజిత్, కె. ఆశిష్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె. శోభారాణి, వ్యాయామ ఉపాధ్యాయుడు సోమపొంగు లెనిన్‌తో పాటు కళాశాల అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి క్రీడలకు ఎంపిక కావాలని ఆకాంక్షిస్తూ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఆదినారాయణ, నవీన్, గోపాలకృష్ణ, శ్రీను, నరేష్, సురేష్, సుధాకర్ రెడ్డి, రవీందర్, రవి, అప్పా రావు, రాధిక, జ్యోతి, ఫిరదోష్, నాగమణి, ఫ్లోరా, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవే లక్ష్యంగా శ్రీ వాసవి సేవా సమితి సేవలు

- జిల్లా అధ్యక్షులు బచ్చు పురుషోత్తం
- వ్యవస్థాపక చైర్మన్ పూరి సురేష్ శెట్టి జన్మదినం సందర్భంగా పేదలకు అల్పాహారం పంపిణీ

సూర్యాపేట, నవంబర్ 11: ఉదయం ప్రతినిధి



సమాజ సేవయే లక్ష్యంగా శ్రీ వాసవి సేవా సమితి సేవలు అందిస్తుందని శ్రీ వాసవి సేవా సమితి సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బచ్చు పురుషోత్తం తెలిపారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన్ సెంటర్ లో శ్రీ వాసవి సేవా సమితి వ్యవస్థాపక జాతీయ చైర్మన్ పూరి సురేష్ శెట్టి 55వ జన్మదిన సందర్భంగా పేద ప్రజలకు అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సమాజ సేవ లక్ష్యంగా గత పది సంవత్సరాల క్రితం వనపర్తికి చెందిన పూరి సురేష్ శెట్టి శ్రీ వాసవి సేవా సమితి స్వచ్ఛంద సంస్థను స్థాపించి ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని పలు రాష్ట్రాలలో ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భయంకరమైన కరోనా సమయంలో ఆనందయ్య మందును పంపిణీ చేసి ప్రాణదాతలుగా నిలిచారని తెలిపారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో జనవరి 25న శ్రీ వాసవి సేవా సమితిని స్థాపించి ఎంతో మంది పేద ప్రజలకు సేవలందిస్తున్నట్లు గుర్తు చేశారు . ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి సేవా సమితి ప్రధాన కార్యదర్శి దేవరశెట్టి నాగరాజు, కోశాధికారి సోమ ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షులు మిర్యాల సుధాకర్, పోతుగంటి వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శులు బచ్చు శ్రీనివాస్, తోనుకునూరి కృష్ణమూర్తి, కమిటీ సభ్యులు తప్పీ గాంధీ, కలకోట లక్ష్మయ్య, వందనపు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల దుర్వినియోగం మరియు రోడ్డు భద్రత పై అవగాహన

దమ్మపేట నవంబర్ 12 (ఉదయం ప్రతినిధి)



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం, దమ్మపేట పి.ఎస్ పరిధిలోని అంకంపాలెం గ్రామం పరిధిలో గల కోడిషాలగూడెం గ్రామం లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, పాల్వంచ సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ యొక్క సూచనల మేరకు, అశ్వారావుపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో, అశ్వారావుపేట సి.ఐ హాజరైన గ్రామస్తులను ఉద్దేశించి మాదకద్రవ్యాల దుర్వినియోగం, రోడ్డు భద్రత మరియు సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో (4) ద్విచక్ర వాహనాలకు జరిమానాలు విధించబడ్డాయి. మొత్తం 52 ఇళ్లు తనిఖీ చేయబడ్డాయి మరియు 33 బైకులు, 04 ప్యాసింజర్ ఆటో మరియు 01 ట్రాక్టర్ వాహనం యొక్క పత్రాలు తనిఖీ చేయబడ్డాయి. కార్యక్రమంలో దమ్మపేట మరియు అశ్వారావుపేట ఎస్.ఐ సిబ్బంది పాల్గొన్నారు.

నారాయణ ఈ-కిడ్స్ ప్రీమియర్ లీగ్ ఘనంగా నిర్వహణ



చిన్నారుల్లో క్రీడాస్ఫూర్తి, జట్టుగా పనిచేసే నైపుణ్యాల పెంపునకు క్రీడా పోటీలు

కోదాడ నవంబర్ 11(ఉదయం)

విద్యార్థుల్లో చదువుతో పాటు క్రీడా స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు, సమష్టి తత్వాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో నారాయణ ఈ-కిడ్స్ ఆధ్వర్యంలో ఈ-కిడ్స్ ప్రీమియర్ లీగ్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు వివిధ క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరిత, ఏవో వీరారెడ్డి, కోఆర్డినేటర్లు సభ, మహేశ్వరి, సెగ్మెంట్ హెడ్స్ రమణయ్య, సలీమా, ఇందిరా పాల్గొన్నారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ క్రీడల ప్రాధాన్యతను వివరించారు. చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా విద్యార్థుల్లో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. చిన్నారులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి దోహదపడతాయని తెలిపారు.



వాలీబాల్ పోటీల్లో మధిర గర్ల్స్ హైస్కూల్‌కు జిల్లా ద్వితీయ స్థానం

మధిర, నవంబర్,11, ఉదయం, ప్రతినిధి:

జిల్లా స్థాయి పాఠశాలల అండర్14 బాలికల వాలీబాల్ క్రీడా పోటీల్లో మధిర గర్ల్స్ హైస్కూల్ జట్టు ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొనేందుకు పాఠశాలకు చెందిన విద్యార్థినులు పి. ప్రసన్న,పి.డింపుల్ ఎంపికయ్యారు. జట్టు విజయంతో పాటు జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థినులు ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీటీ అపర్ణతో పాటు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.



పేదలకు ఉచిత కంటి వైద్య సేవలు అభినందనీయం

కాకతీయ సేవా సమితి సేవలను ప్రశంసించిన మంత్రి ఉత్తమ్

కోదాడ నవంబర్ 11 (ఉదయం)

పేదలకు నయాపైసా ఖర్చు లేకుండా ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని రాష్ట్ర మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం కోదాడ బైపాస్ రోడ్డులోని కాకతీయ సేవా సమితి కల్యాణ మండపంలో శంకర నేత్రాలయ సహకారంతో రావెళ్ల సీతారామయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి శస్త్రచికిత్స శిబిరాన్ని ఎంపీ కుందూరు రఘువీరారెడ్డి, ఎమ్మెల్యే నలమాద పద్మావతి రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చందారావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాకతీయ సేవా సమితి సేవలను మంత్రి అభినందించారు. వైద్య పరికరాల కొనుగోలుకు ఎంపీ నిధులు కేటాయిస్తానని ఎంపీ రఘువీరారెడ్డి హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి కోరారు. తొలిరోజు 200 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు.

రామకృష్ణాపురంలో గ్రామ సమైక్య భవనానికి ఘనంగా శంకుస్థాపన



శంకుస్థాపన చేసిన గ్రామ సర్పంచ్ గాదె నాగలక్ష్మి

చింతకాని నవంబర్ 11 (ఉదయం ప్రతినిధి):

మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామంలో మహిళా స్వయం సహాయక సంఘాల కార్యకలాపాల నిర్వహణ కోసం నిర్మించనున్న గ్రామ సమైక్య (వి.ఓ) భవనానికి ఘనంగా శంకుస్థాపన చేసిన గ్రామ సర్పంచ్ గాదె నాగలక్ష్మి . ప్రత్యేక పూజలు నిర్వహించి భవన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చింతకాని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కన్నెబోయిన గోపి, ఏఎంసీ చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు హాజరై శంకుస్థాపన కార్యక్రమములో పాల్గొని మాట్లాడుతూ గ్రామంలో మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రత్యేకంగా సొంత భవనం ఏర్పాటు కావడం సంతోషకరమన్నారు. మహిళా సంఘాల సమావేశాలు, పొదుపు కార్యక్రమాలు, ఇతర సమాఖ్య కార్యకలాపాలను ఒకే వేదికపై నిర్వహించేందుకు ఈ భవనం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా మరింత అభివృద్ధి సాధించేందుకు ఇటువంటి సదుపాయాలు దోహదపడతాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో , సీపీఐ మండల నాయకులు జమ్ముల జితేందర్ రెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, గ్రామపంచాయతీ కార్యదర్శి ఎన్. మురళి, ఉపసర్పంచ్ గాదె రామారావు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బల్లెం చిన్న పుల్లయ్య, మాజీ సర్పంచ్ తిరుపతి గోవిందరావు, వార్డు సభ్యులు కొర్లపాటి చిరంజీవి, శీలం బలరామ్, పగిడిపల్లి రామారావు, , ఫీల్డ్ అసిస్టెంట్ కర్లపూడి లక్ష్మయ్య గ్రామస్తులు పాల్గొన్నారు

సీఎం సహాయ నిధి ద్వారా రూ.5 లక్షల ఆర్థిక సహాయం మంజూరు చేయండి

సీఎంకి లేఖ రాసిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

భద్రాచలం 11/11/26 ఉదయం ప్రతినిధి:



నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు తన వంతు సహకారం అందించడంలో భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ప్రజల ఆరోగ్య సమస్యలను, ఆర్థిక ఇబ్బందులను మానవతా దృక్పథంతో పరిశీలిస్తూ, అత్యవసర వైద్య పరిస్థితుల్లో బాధిత కుటుంబాలకు ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా వెంకటాపురం మండలం, వీఆర్ పురం గ్రామానికి చెందిన బద్ది సదాలమ్మ వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) ద్వారా లెటర్ ఆఫ్ క్రెడిట్ (LOC) రూపంలో రూ.5 లక్షల ఆర్థిక సహాయం మంజూరు చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారికి ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు లేఖ రాశారు. వివరాల్లోకి వెళితే.. వెంకటాపురం మండలం వీఆర్ పురం గ్రామానికి చెందిన బద్ది సదాలమ్మ మయోసైటిస్ అనే వ్యాధితో బాధపడుతూ ప్రస్తుతం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో వైద్య చికిత్స పొందుతున్నారు. ఈ వ్యాధి కారణంగా ఆమె ఆరోగ్య పరిస్థితి ఇబ్బందికరంగా మారడంతో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగించాల్సిన అవసరం ఏర్పడింది. ధీత కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారికి ప్రత్యేకంగా లేఖ రాస్తూ, బద్ది సదాలమ్మకు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి లెటర్ ఆఫ్ క్రెడిట్ (LOC) ద్వారా రూ.5,00,000 (ఐదు లక్షల రూపాయలు) ఆర్థిక సహాయం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

రాజకీయ పార్టీల భాగస్వామ్యంతోనే ఓటర్ల జాబితా పారదర్శకత

- ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్
- సమగ్ర ఓటర్ సవరణ, ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్

ఖమ్మం, ఉదయం బ్యూరో నవంబర్ -11



రాజకీయ పార్టీల పూర్తి భాగస్వామ్యం, సమన్వయంతోనే పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారీ సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ అన్నారు. బుధవారం ఖమ్మం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమగ్ర ఓటర్ల సవరణ (SIR-2026), పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో సమగ్ర ఓటర్ల సవరణ ప్రక్రియ శరవేగంగా సాగుతోందన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో నివాసంలో లేనివారు, స్థలం మారినవారు, మృతి చెందినవారు, నకిలీ/రెండోసారి నమోదైన ఓటర్ల పేరుతో ఏఎస్ డిడి కేటగిరీ కింద తొలగించిన ఓటర్లకు తుది జాబితాలో పేరు చేర్చుకోవడానికి ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించిందని తెలిపారు. జిల్లాలోని 5 అసెంబ్లీ నియోజకవర్గాలు ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి వ్యాప్తంగా మొత్తం 1,57,854 మందిని ఏఎస్ డిడి కేటగిరీ కింద గుర్తించినట్లు తెలిపారు. ఇందులో శాశ్వతంగా వేరే ప్రాంతాలకు మారినవారు 1,01,549 మంది, మరణించినవారు 33,380 మంది, ఇతర నియోజకవర్గాల్లో ముందే ఓటు నమోదు పొందినవారు 11,004 మంది, గైర్హాజరైనవారు 11,371 మంది ఉన్నారన్నారు. వీరందరికీ సవరణ ప్రక్రియ కింద నోటీసులు జారీ చేయగా, ఇప్పటివరకు జారీ చేసిన 1,75,840 నోటీసులలో 1,75,753 నోటీసులను పంపిణీ చేసి విచారణ నిర్వహించినట్లు స్పష్టం చేశారు. నోటీసుల విచారణ ప్రక్రియను నవంబర్ 26 నాటికి పూర్తి చేసి, నవంబర్ 30న ఓటర్ల తుది జాబితాను ప్రచురించనున్నట్లు తెలిపారు. వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరు నమోదు (ఫారమ్-18) పురోగతిపై కలెక్టర్ మాట్లాడుతూ, నవంబర్ 6 నాటికి దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసిందని, జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,09,942 ఫారమ్-18 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. నవంబర్ 20 నాటికి డ్రాఫ్ట్ రోల్ తయారీ పూర్తి చేసి, నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తామని, డిసెంబర్ 30న ఎమ్మెల్సీ తుది ఓటర్ల జాబితా విడుదలవుతుందని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ఎస్డీసీ సదానందం, కలెక్టరేట్ ఎన్నికల డీటీ అన్సారీ, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, బిఎస్పి పార్టీ ప్రతినిధి వేల్పుల రామయ్య, టీడీపీ పార్టీ ప్రతినిధి పాలడుగు టిఆర్ కృష్ణప్రసాద్, బిజెపి పార్టీ ప్రతినిధి వి. రాజేష్, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధులు బి. వేణుగోపాల్, మంకెన రమేష్, సిపిఎం పార్టీ ప్రతినిధి ఆర్. ప్రకాష్, సీపీఐ (ఎం) పార్టీ ప్రతినిధి ఏ. విప్లవ కుమార్, ఐఎన్సి పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నబండిరేవులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ స్లాబ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన



ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

దుమ్ముగూడెం 11/11/26 వుదయం ప్రతినిధి:

దుమ్ముగూడెం మండలం చిన్నబండిరేవు గ్రామంలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవన నిర్మాణ పనుల్లో మరో కీలక ముందడుగు పడింది. పాఠశాల భవన నిర్మాణంలో భాగంగా చేపట్టనున్న స్లాబ్ నిర్మాణ పనులను భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు కొబ్బరి కాయ కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించి స్లాబ్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ వంటి విద్యా సంస్థలు భవిష్యత్తులో గ్రామీణ విద్యారంగానికి ఎంతో మేలు చేస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. చిన్నబండిరేవు గ్రామంలో నిర్మిస్తున్న పాఠశాల భవన నిర్మాణ పనులను నిర్దేశిత ప్రణాళిక ప్రకారం వేగవంతంగా కొనసాగించాలని, నిర్మాణంలో ఎక్కడా నాణ్యతా ప్రమాణాలు తగ్గకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు సూచించారు. విద్యార్థులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన విద్యా వాతావరణం కల్పించేలా నిర్మాణ పనులను పర్యవేక్షించాలని, పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడానికి సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యూత్ నాయకులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. స్లాబ్ నిర్మాణ పనుల ప్రారంభంతో పాఠశాల భవన నిర్మాణం మరింత ముందుకు సాగుతుండటంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యూత్ నాయకులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

పీవీటీజీ గ్రామాల్లో ఉపాధి హామీ పనుల గడువులోగా పూర్తి చేయాలి

సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్

భద్రాచలం, 11/11/26 వుదయం ప్రతినిధి:

ఏజెన్సీ ప్రాంతంలోని ప్రత్యేకంగా బలహీన గిరిజన తెగలు (పీవీటీజీ) నివసించే గ్రామాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న వి.బి.జి. రామ్ జి (ఉపాధి హామీ) పథకం కింద నిర్దేశించిన పనులన్నింటినీ నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించి అమలు చేయనున్నట్లు ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ వెల్లడించారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ ఆదేశాలు, సూచనల మేరకు పీవీటీజీ గ్రామాల్లో ఉపాధి హామీ పనులను వేగవంతం చేసి, నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు.వి.బి.జి. రామ్ జి పథకం కింద చేపట్టాల్సిన పనులన్నింటినీ నిర్దేశించిన లక్ష్యాల మేరకు పీవీటీజీ గ్రామాల పరిధిలోని ఎంపీడీవోల ద్వారా గుర్తించి, వాటిని నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా అవసరమైన ఆదేశాలు జారీ చేస్తామని ఆయన తెలిపారు. బుధవారం రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్ అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వి.బి.జి. రామ్ జి పథకం కింద జరుగుతున్న పనుల పురోగతిపై సమగ్ర సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా పనుల లక్ష్యాలు, ఇప్పటివరకు సాధించిన పురోగతి, ఇంకా ప్రారంభించాల్సిన పనులు, పనుల పూర్తికి ఎదురవుతున్న సమస్యలు, నిధుల వినియోగం తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. బి.రాహుల్ సూచనల మేరకు సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంత పరిధిలోని పీవీటీజీ గ్రామాల్లో వి.బి.జి. రామ్ జి పథకం కింద చేపట్టాల్సిన అన్ని పనులను సంబంధిత ఎంపీడీవోలు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. ముఖ్యంగా ప్రతి ఇంటికి ఇంకుడు గుంతల నిర్మాణం, బోరుబావుల వద్ద భూగర్భ జలాల పెంపునకు రీఛార్జ్ నిర్మాణాలు, రైతులకు ఉపయోగపడే వ్యవసాయ కుంటల ఏర్పాటు పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ పనులు పూర్తయితే గ్రామాల్లో వర్షపు నీరు వృథాగా వెళ్లకుండా భూమిలోకి ఇంకి భూగర్భ జలాల నిల్వలు పెరిగేందుకు అవకాశం ఉంటుందని, వ్యవసాయ అవసరాలకు నీటి లభ్యత మెరుగుపడటంతో పాటు గిరిజన రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. ప్రతి పీవీటీజీ గ్రామంలో చేపట్టాల్సిన పనులను ముందుగానే గుర్తించి, లబ్ధిదారులతో సమన్వయం చేసుకొని పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కేవలం లక్ష్యాలను నిర్ణయించడమే కాకుండా, క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభమయ్యాయా లేదా, పనులు ఏ దశలో ఉన్నాయి, నిర్దేశించిన సమయంలో పూర్తవుతున్నాయా లేదా అనే అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ప్రతి ఎంపీడీవో తమ పరిధిలోని పీవీటీజీ గ్రామాలను సందర్శించి, గ్రామాల వారీగా పనుల పురోగతిని సమీక్షిస్తూ



లక్ష్యాల సాధనకు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు పనుల అమలులో ఎవరైనా నిర్లక్ష్యం వహించినా, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినా ఉపేక్షించేది లేదని డేవిడ్ రాజ్ స్పష్టం చేశారు. ఇంకుడు గుంతల నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వం వద్ద తగినన్ని నిధులు అందుబాటులో ఉన్నాయని, పనులు పూర్తయిన అనంతరం 15 రోజుల్లోగా నిధులు విడుదలయ్యే అవకాశం ఉందని ఆయన వివరించారు. ఐటీడీఏ పీవో బి.రాహుల్ మార్గదర్శకత్వంలో ఏజెన్సీ ప్రాంతంలోని పీవీటీజీ గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేసి, ఉపాధి హామీ పథకం లక్ష్యాలను సకాలంలో సాధించేందుకు అన్ని స్థాయిల అధికారులు సమష్టిగా కృషి చేయాలని సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ పిలుపునిచ్చారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఎస్ఓ ప్రభాకర్ రావు, బీఆర్ఎల్‌జీఎఫ్ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ చేనేత సొసైటీ ఎన్నికల్లో వజ్రమ్మ విజయం

- జగదీష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన విన్నర్స్
- 19న గట్టుప్పల్‌లో ఘనంగా సన్మానం

గట్టుప్పల్, సెప్టెంబర్ 12(వుదయం)



ఆల్ ఇండియా హ్యాండ్లూమ్స్ వీవర్స్ కో–ఆపరేటివ్ సొసైటీ (న్యూఢిల్లీ) ఎన్నికల్లో బిఆర్ఎస్ మద్దతుదారులు ఘన విజయం సాధించారు. సొసైటీ ఎన్నికల్లో విజేతగా నిలిచిన కర్నాటి వజ్రమ్మ–వెంకటేశం దంపతులు గురువారం హైదరాబాద్‌లో సూర్యాపేట శాసనసభ్యులు, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తన గెలుపునకు సహకరించినందుకు జగదీష్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, కర్నాటి గిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. చేనేత రంగానికి సేవలు అందిస్తూ జాతీయ స్థాయి ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కర్నాటి వజ్రమ్మ వెంకటేశం దంపతులను ఈ నెల 19వ తేదీ (గురువారం) ఉదయం 10 గంటలకు బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గట్టుప్పల్‌లో ఘనంగా సన్మానించనున్నారు. ఈ ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో మునుగోడు నియోజకవర్గ స్థాయి పార్టీ నాయకులు, చేనేత సంఘాల ప్రతినిధులు, ముఖ్య నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

ఓటరు జాబితాలో పేరు చేర్చుకోవాలి

జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

యాదాద్రి భువనగిరి జిల్లా, వుదయం ప్రతినిధి



బుధవారం మినీ మీటింగ్ హల్ లో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి,వివిధ పొలిటికల్ పార్టీ నాయకుల తో,SIR, MLC పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ మాట్లడుతూ .ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు నమోదు కాని అర్హులైన ఓటర్లకు మరో అవకాశం కల్పించిన ప్రక్రియపై జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు నవంబర్ 21 వరకు ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించేందుకు గడువు పొడగించడం జరిగిందని తెలిపారు . బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఎ ఎస్ డి డి జాబితాలో ఉన్న ఓటర్లను సంప్రదించి, వారికి అనుబంధ ఫారాలను అవసరాన్ని బట్టి ప్రకటన పత్రాల సమర్పణ విధానాన్ని వివరించడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరుకు తుది ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునే అవకాశం కల్పించిందని అన్నారు. వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సంబంధించి ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని, ఓటరు నమోదు దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి, అర్హులైన పట్టభద్రులకు ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీతారామచంద్రస్వామివారిని దర్శించుకున్న రాష్ట్ర రెవెన్యూ, దేవాదాయ శాఖల ఉన్నతాధికారులు

భద్రాచలం, 11/11/26 వుదయం ప్రతినిధి:



ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామివారిని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, దేవాదాయ శాఖల ప్రధాన కార్యదర్శి శైలజ రామయ్యర్,దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఉన్నతాధికారులకు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి దివ్య ఆశీస్సులు పొందారు. దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధిగాంచిన భద్రాచలం పుణ్యక్షేత్రంలో కొలువై ఉన్న సీతారామచంద్రస్వామివారి దర్శనం ఎంతో ఆధ్యాత్మిక ప్రశాంతతను, భక్తిభావాన్ని కలిగిస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలోని ఆధ్యాత్మిక వాతావరణాన్ని, స్వామివారి వైభవాన్ని వారు తిలకించారు. దర్శనానంతరం వేద పండితులు వారికి వేదాశీర్వచనం అందించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ సంప్రదాయాలకు అనుగుణంగా దర్శన కార్యక్రమం కొనసాగింది. రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు స్వామివారిని దర్శించుకోవడంతో ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

పలు కార్యక్రమాల్లో పాల్గొన్న బిఆర్ఎస్ జిల్లా నాయకులు సోయం వీరభద్రం

దమ్మ పేట నవంబర్ 11 (వుదయం ప్రతినిధి):



అశ్వరావుపేట (నియోజకవర్గం)దమ్మపేట (మండలం) ఆర్లపెంట (గ్రామం)లో గ్రామస్థుల ఆహ్వానం మేరకు గ్రామదేవత ముత్యాలమ్మ తల్లి నూతన ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమం లో ముఖ్య అతిథి గా హాజరు అయిన సోయం వీరభద్రం ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికి ఆహ్వానించారు.అనంతరం ముత్యాలమ్మ తల్లిని దర్శనం చేసుకున్న సోయం వీరభద్రం న్నీ కండువ తో సత్కారించారు.ఈ సందర్భంగ సోయం వీరభద్రం మాట్లడుతు ముత్యాలమ్మ తల్లి ఆశిస్సులు సమస్త ప్రజానికం పైన ఉండాలని సుఖసంతోష లతో,ఆయురారోగ్యలతో నిండుగా వర్ధిల్లాలి అని ఆయన అన్నారు.అనంతరం దమ్మపేట మండలం కి సుమారు 10 కిలోమీటర్ల ఆటవి ప్రాంతాలలో ఉన్నా ఆదివాసి గ్రామాలు పుసుకుంట–కట్కూరు గ్రామాల వారధి రహదారి ఇటీవల మురాసు తూఫాన్ భారీ వరదలకు రోడ్ రహదారి మార్గం పూర్తి గా దేబ్బతిన్నది అని వెంటనే రహదారి మార్గం మారమ్మత్తులు సంబంధిత అధికారులు త్వరితగతిన పూర్తి చేయలని దమ్మపేట మండల కేంద్రం కి అనారోగ్యంతో చికిత్స తీపిసుకోవలంటే ఇదే రోడ్డు మార్గం ద్వారా రాకపోకలు కోనసాగిస్తారు అని ఆయన తెలియజేశారు..ఈ కార్యక్రమం లో మాజీ సర్పంచ్ వంకా ముత్యాలరావు, తౌలెం. మల్లేష్ సోయం నాగేశ్వరరావు,మడకం గంగరాజు, వసంత రావు, వ ంకా. రాంబాబు, వగ్గెల . జోగారావు సున్నం.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లిలో మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు

సత్తుపల్లి నవంబర్ 11 (వుదయం ప్రతినిధి)



సత్తుపల్లి – ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి మరియు స్వాతంత్ర సమరయోధుడు, ఆధునిక విద్య వ్యవస్థకు గట్టి పునాదులు వేసిన " మౌలానా అబుల్ కలాం ఆజాద్ "జయంతి సందర్భంగా ఆ మహనీయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన.... సత్తుపల్లి నియోజకవర్గం శాసనసభలు శడాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రిహానా బేగం కమల్ పాషా, సత్తుపల్లి నూతన ఏఎంసి చైర్మన్ చల్లగుళ్ల నరసింహ రావు, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, సత్తుపల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, సీనియర్ నాయకులు శివ వేణు, సామేలు, సత్తుపల్లి పట్టణ మున్సిపల్ కౌన్సిలర్స్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

కే.ఆర్.ఆర్ కళాశాల విద్యార్థులకు ఆర్థిక సహాయం



కోదాడ నవంబర్ 11 (వుదయం)

కోదాడలోని కె.ఆర్.ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష ఫీజులు చెల్లించలేని 50 మం ది నిరుపేద విద్యార్థులకు ప్రవాస భారతీయుడు పానుగంటి రుషి రాజా రూ.47 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమానికి ప్రిన్సిపాల్ నారు రమణారెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సులోచన రాణి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పిస్తూ వారి కలలకు రెక్కలు తొడిగిన రుషి రాజా సేవ అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమానికి కృషి చేసిన ఫిజిక్స్ లెక్చరర్ పానుగంటి రాజేష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం కళాశాలలో వెయిట్ లిఫ్టింగ్, వాలీబాల్, నృత్య పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు వేముల వెంకటేశ్వర్లు, అధ్యాపకులు ఆర్. పిచ్చిరెడ్డి, జి. యాదగిరి, వి. బలభీమరావు, ఆర్. రమేష్, పి. రాజేష్, బి. రమేష్ బాబు, జి. వెంకన్న, ఆర్. రవికిరణ్, కె. సతీష్, జి. నాగరాజు, ఎస్. గోపికృష్ణ, ఎస్.కె. ముస్తఫా, జె. తిరుపతయ్య, ఎస్.కె. ఆరిఫ్, కె. శాంతయ్య, ఎన్. జ్యోతిలక్ష్మి , ఆర్. చంద్రశేఖర్, టి. మమత, డి.ఎస్. రావు తదితరులు పాల్గొన్నారు.

నల్గొండలో 480 ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి

డిసెంబర్ 5లోగా అర్హులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి : జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

నల్గొండ, వుదయం ప్రతినిధి



నల్గొండ పట్టణంలోని దేవరకొండ రోడ్డులో మామిళ్లగూడ వద్ద 480 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో జీ+5 అంతస్తుల బ్లాక్‌లలో ఈ ఇళ్లను నిర్మించనున్నట్లు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం జి.ఓ.ఆర్.టి. నెం.579 ద్వారా ఈ నిర్మాణాలకు అనుమతి ఇచ్చిందని, ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.8.50 లక్షలు ఖర్చు అవుతుందని తెలిపారు. ఇందులో ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ అందించనుండగా, లబ్ధిదారులు తమ వాటాగా రూ.3.50 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నివసిస్తున్న అర్హులైన వారు మీ సేవా కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లో డిసెంబర్ 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

దరఖాస్తుకు అర్హతలు:

– దరఖాస్తుదారులకు నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సొంత ఇల్లు లేదా ప్లాట్ ఉండకూడదు.

– కుటుంబ వార్షిక ఆదాయం రూ.6 లక్షలకు మించకూడదు.

– ఒక కుటుంబం నుంచి ఒక్కరు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

– దరఖాస్తుదారు తప్పనిసరిగా నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నివాసి అయి ఉండాలి.

అర్హులైన వారు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

జిసిసి కార్యాలయంలో అకౌంట్స్ బుక్స్, రికార్డుల సమగ్ర పరిశీలన

సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్

భద్రాచలం, 11/11/26 వుదయం ప్రతినిధి:



గిరిజన సహకార సంస్థ (జిసిసి) పరిధిలో నిర్వహిస్తున్న వివిధ వ్యాపార లావాదేవీలు, నిత్యావసర సరుకుల కొనుగోళ్లు, అమ్మకాలు, గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని వివిధ విద్యాసంస్థలు, ఇతర సంస్థలకు సరఫరా చేస్తున్న సరుకులకు సంబంధించిన అకౌంట్స్ బుక్స్, రికార్డులను సమగ్రంగా పరిశీలించడం జరిగిందని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి (జనరల్) డేవిడ్ రాజ్ తెలిపారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆదేశాల మేరకు బుధవారం జిసిసి కార్యాలయానికి సంబంధించిన వివిధ రకాల ఆర్థిక లావాదేవీల రికార్డులు, అకౌంట్ రిజిస్టర్లు, బిల్లులు, ఇతర సంబంధిత పుస్తకాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డేవిడ్ రాజ్ మాట్లాడుతూ జిసిసి పరిధిలోని డీఆర్ డిపోల ద్వారా నిర్వహిస్తున్న నిత్యావసర సరుకుల కొనుగోళ్లు, అమ్మకాలు, కార్యాలయం ద్వారా చేపడుతున్న వివిధ రకాల సరుకుల వ్యాపార లావాదేవీలకు సంబంధించిన వివరాలను పూర్తిస్థాయిలో పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా గత సంవత్సరం కాలంగా జిసిసి ద్వారా నిర్వహించిన కొనుగోళ్లు, అమ్మకాలు, సరుకుల నిల్వలు, వాటి పంపిణీ, గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని విద్యాసంస్థలు, ఇతర ప్రభుత్వ సంస్థలకు సరఫరా చేసిన నిత్యావసర వస్తువులకు సంబంధించిన వివరాలను నెలల వారీగా నమోదు చేసిన రికార్డులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. జిసిసి ద్వారా నిర్వహించే కొనుగోళ్లు, అమ్మకాలు, సరుకుల సరఫరా వంటి కార్యకలాపాలకు సంబంధించిన లెక్కల్లో స్పష్టత, పారదర్శకత ఉండేలా చర్యలు తీసుకోవడం ఈ పరిశీలన ముఖ్య ఉద్దేశమని తెలిపారు. తనిఖీలో భాగంగా సేకరించిన వివరాలు, పరిశీలించిన రికార్డులు, బిల్లులు, రిజిస్టర్ల నమోదుకు సంబంధించిన సమగ్ర నివేదికను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్‌కు అందజేయనున్నట్లు సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజ్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిసిసి మేనేజర్ సమ్మయ్యతో పాటు కార్యాలయ సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కూచిపూడి ఆలయాలకు ధ్వజస్తంభాల విరాళం


కోదాడ నవంబర్ 11 (వుదయం)

కోదాడ మండల పరిధిలోని కూచిపూడి గ్రామంలో నిర్మాణంలో ఉన్న దేవాలయాలకు ధ్వజస్తంభాలు సమకూర్చేందుకు దాతలు ముందుకొచ్చారు. శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయానికి పసుపులేటి లక్ష్మీనారాయణ, శ్రీ లక్ష్మీనృసింహ స్వామి ఆలయానికి మందలపు శేషయ్య ధ్వజస్తంభాలను విరాళంగా అందించేందుకు ముందుకొచ్చారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు కందికొండ సాయిబాబు దాతలను అభినందించారు. ఆలయాల నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శెట్టి సురేష్ నాయుడు, శెట్టి పూర్ణచందర్ రావు, శెట్టి వెంకట నారాయణ, పోతురాజు శ్రీనివాసరావు, శెట్టి శ్రీనివాసరావు, శిరంశెట్టి వెంకట్రావు, శెట్టి నర్సింహారావు, పసుపులేటి నర్సింహారావు, షేక్ సైదా తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మోటార్ల దొంగతనాల కేసులను ఛేదించిన పోలీసులు

యాదాద్రి భువనగిరి జిల్లా. వుదయం ప్రతినిధి

యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు పోలీసులు వరుసగా జరుగుతున్న వ్యవసాయ మోటార్ల దొంగతనాల కేసులను విజయవంతంగా ఛేదించారు. మోత్కూరు, అడ్డగూడూరు, తిరుమలగిరి, లింగాలఘణపురం పోలీస్‌స్టేషన్ల పరిధిలోని పలు గ్రామాల్లో వ్యవసాయ మోటార్లను దొంగిలిస్తున్న నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. అన్నీపురం ఎక్స్‌రోడ్డు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఎర్టిగా కారులో అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను గుర్తించి విచారించగా దొంగతనాల విషయం వెలుగులోకి వచ్చింది. ఈ సందర్భంగా నిందితుల నుంచి మొత్తం 18 వ్యవసాయ మోటార్లు, దొంగతనాలకు ఉపయోగించిన ఎర్టిగా కారు, కట్టింగ్ ప్లయర్, స్పానర్లు, హ్యాక్సా బ్లేడ్‌తో పాటు నాలుగు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మోటార్ల విలువ సుమారు రూ.2 లక్షలుగా అంచనా వేశారు. జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్, అదనపు ఎస్పీ లక్ష్మీనారాయణ నేతృత్వంలో పోలీసులు ఈ కేసును ఛేదించారు.



విద్యా రంగానికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయం

రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి

యాదాద్రి భువనగిరి జిల్లా వుదయం ప్రతినిధి

బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ 138వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి మౌలానా అబుల్ కలాం ఆజాద్ కు రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి జ్యోతి ప్రజ్వలన గావించి, చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రంధాలయ చైర్మన్ అవేజ్ చిస్తీ,జిల్లా అధికారులు, కుల సంఘ నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు . ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చిస్తీ,జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, కుల సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రెడ్లకుంట లిఫ్ట్ ఇరిగేషన్ పనులు డిసెంబర్ చివరినాటికి పూర్తి చెయ్యాలి

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

కోదాడ నవంబర్ 11(వుదయం)



రైతులకు సాగునీరు అందించేందుకు చేపట్టిన రెడ్లకుంట లిఫ్ట్ ఇరిగేషన్ పనులను డిసెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. బుధవారం కోదాడ మండల పరిధిలోని రెడ్లకుంట వద్ద పాలేరు వాగుపై నిర్మిస్తున్న లిఫ్ట్ ఇరిగేషన్ పనులను ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కాలువలు, అండర్‌గ్రౌండ్ మోటార్లు, సబ్‌స్టేషన్ పనులను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. రూ.47.64 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా ఖరీఫ్, రబీ సీజన్లలో 4,460 ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. ద్వారకుంటలో 66, నల్లబండగూడెంలో 1,400, కాపుగల్లులో 1,608, కూచిపూడిలో 400, రెడ్లకుంటలో 576, చిమిరాలలో 410 ఎకరాలకు నీరు అందించనున్నట్లు వివరించారు. 430 కిలోవాట్ల సామర్థ్యం గల నాలుగు మోటార్ల ద్వారా మొత్తం 1,486 కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ప్రస్తుతం 70 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ నరసింహ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, ఇరిగేషన్ సీఈ నాగభూషణం, మార్కెట్ కమిటీ చైర్మన్, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ కలయిక

సేవా కార్యక్రమాలతో సమాజానికి అండగా నిలుస్తున్న విశ్రాంత ఉద్యోగులు..

భద్రాచలం, 11/11/26 వుదయం ప్రతినిధి:



రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ కలయిక సమ్మేళనం భద్రాచలంలోని కార్యాలయ భవనంలో ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగులందరూ ఒకచోట సమావేశమై పరస్పరం ఆత్మీయంగా పలకరించుకుంటూ, పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, తమ అనుభవాలను పంచుకుంటూ ఆనందంగా గడిపారు. ఉద్యోగ జీవితంలో ఎన్నో సంవత్సరాల పాటు ప్రభుత్వ వివిధ శాఖల్లో బాధ్యతలు నిర్వర్తించి ప్రజలకు సేవలందించిన విశ్రాంత ఉద్యోగులు, ఉద్యోగ విరమణ అనంతరం కూడా సామాజిక బాధ్యతను గుర్తించి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం ఈ సమ్మేళనం ప్రత్యేకతగా నిలిచింది. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు జి. భూషణ్ రావు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు తరచూ ఇలాంటి ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేసుకోవడం ఎంతో అవసరమని అన్నారు. నిరుపేదలకు తమకు చేతనైన సహాయం అందించాలనే లక్ష్యంతో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. ముఖ్యంగా ఆర్థిక ఇబ్బందులతో వైద్య సేవలు పొందలేని పేదలకు సహకరించడం, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి తగిన వైద్య సలహాలు అందించడం, అవసరమైన వారిని సంబంధిత వైద్యుల వద్దకు పంపించి చికిత్స పొందేలా చూడడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. మొక్కలు నాటడం, చెట్లను సంరక్షించడం, నీటి వనరులను కాపాడుకోవడం వంటి చిన్నచిన్న చర్యలే భవిష్యత్తులో పర్యావరణ పరిరక్షణకు ఎంతో ఉపయోగపడతాయని వివరించారు. పర్యావరణాన్ని కాపాడటం అంటే మన ఆరోగ్యాన్ని, మన భవిష్యత్తును కాపాడుకోవడమేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ సెక్రటరీ మధుసూదన్, హజయ్య, వెంకన్న, రామచందర్ రావు, హనుమంత రావు, శేఖర్, భిక్షం రెడ్డి, తులసి దాస్, అనసూయ, మాణిక్య కుమారి, విజయ లక్షి , సరోజ, అన్నపూర్ణ, మహాలక్షి తదితరులు పాల్గొన్నారు.

గోదావరి పుష్కరాల ఏర్పాట్ల పనులను వేగవంతం చేయాలి

దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్

భద్రాచలం, నవంబర్ 11: వుదయం ప్రతినిధి




రానున్న 2027 గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని భద్రాచలంలోని గోదావరి నదీ తీర ప్రాంతాల్లో చేపడుతున్న పుష్కర ఘాట్ల అభివృద్ధి పనులు, శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం పరిసరాల అభివృద్ధి పనులు, భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన పనులను యుద్ధప్రాతిపదికన వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. వచ్చే ఏప్రిల్ నాటికి గోదావరి పుష్కరాలకు సంబంధించిన అభివృద్ధి పనులన్నింటినీ పూర్తి చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఆమె స్పష్టం చేశారు. పుష్కరాలకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు భద్రాచలం తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ముఖ్యంగా వీఐపీ భక్తులు, సామాన్య భక్తులకు వేర్వేరుగా సౌకర్యాలు కల్పించి, ఎవరికీ ఇబ్బందులు కలగకుండా దర్శనం, స్నానఘట్టాలు, పార్కింగ్, రవాణా తదితర ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. బుధవారం భద్రాచలం పర్యటనకు వచ్చిన దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ తొలుత శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో చేపడుతున్న అభివృద్ధి పనులను, గోదావరి నదీ తీరంలో నిర్మిస్తున్న నూతన పుష్కర ఘాట్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సమీక్షా సమావేశంలో దేవస్థానం ఈవో కే. దామోదర్ రావు, ఆర్ అండ్ బీ ఈఈ నాగేశ్వరరావు, డీపీఓ అనూష, ట్రాన్స్‌కో ఎస్సీ మహేందర్, డీఎంహెచ్‌వో తుకారం రాథోడ్, డీఏవో భగవాన్ రెడ్డి, తహసీల్దార్ రవికుమార్, భద్రాచలం సర్పంచ్ పూనెం కృష్ణతో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది, కన్సల్టెంట్లు, కాంట్రాక్టర్లు, సంబంధిత కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలకు మరింత చేరువలో ప్రభుత్వ సేవలు

- ఉరుమడ్లలో మీ-సేవ కేంద్రం ప్రారంభం
- రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు సుంకరి మల్లేశ్ గౌడ్

నల్గొండ జిల్లా

నవంబర్ 11 వుదయం ప్రతినిధి



చిట్యాల మండలం గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడంతో పాటు, వివిధ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే ఇబ్బందులను తగ్గించేందుకు మీ–సేవ కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు సుంకరి మల్లేశ్ గౌడ్ అన్నారు. చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలో ఏర్పాటు చేసిన మీ–సేవ కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. మీ–సేవ కేంద్రాల ద్వారా ప్రజలు కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించిన దరఖాస్తులు, ఇతర ఆన్‌లైన్ సేవలను సులభంగా పొందవచ్చన్నారు. గ్రామ ప్రజలు ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అయ్యప్ప ఆలయంలో భోజనశాల ప్రారంభం



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఎమ్మెల్యే బాలు నాయక్

నల్గొండ జిల్లా వుదయం ప్రతినిధి నవంబరు 11:

దేవరకొండ పట్టణంలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో తెలంగాణ శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే బాలు నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన భోజనశాలను గుత్తా సుఖేందర్‌రెడ్డి, బాలు నాయక్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయాలకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం అభినందనీయమన్నారు. భక్తుల సౌకర్యార్థం భోజనశాలను ఏర్పాటు చేయడం సంతోషకరమని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో శాంతి, సామరస్యం, ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. అయ్యప్ప స్వామి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్న నిర్వాహకులను అభినందించారు.

భూముల రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

యాదాద్రి భువనగిరి జిల్లా వుదయం ప్రతినిధి

రాష్ట్రంలో భూముల రీసర్వే ప్రక్రియను ప్రజలకు మేలు జరిగేలా, సానుకూల వాతావరణంలో పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రీసర్వేలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్ నుంచి రెవెన్యూ శాఖ కార్యదర్శి డీ ఎస్ లోకేష్ కుమార్, ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో భూముల రీసర్వే ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.., భూముల రీసర్వే ప్రక్రియపై ఇప్పటికే పలుమార్లు సమావేశాలు నిర్వహించామని, ఉమ్మడి జిల్లాలలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ జిల్లా స్థాయి నుంచి మండల స్థాయి వరకు రెవెన్యూ అంశాలపై సమీక్షలు నిర్వహించామని తెలిపారు. రీసర్వే ఫలితాలు క్షేత్రస్థాయిలో ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు గ్రౌండ్ రిపోర్టులను సేకరిస్తున్నామని పేర్కొన్నారు. రీసర్వే సందర్భంగా ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై సమగ్రంగా చర్చిస్తున్నామని తెలిపారు. భూముల రీసర్వేకు సంబంధించి రూపొందించిన ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్ఓపీ)ను అధికారులు పక్కాగా అమలు చేయాలని మంత్రి సూచించారు. క్షేత్రస్థాయి నివేదికల ఆధారంగా అవసరమైన మార్పులు, సవరణలు చేపట్టాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించేలా నివేదికలు ఉండాలని స్పష్టం చేశారు. నవంబర్ నెలాఖరులోగా ప్రతి జిల్లాలో తొలి విడతలో ఎంపిక చేసిన 70 గ్రామాలతో పాటు నక్షా లేని గ్రామాల్లో రీసర్వే ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు.

మండలాల వారీగా సర్వే బృందాల ఏర్పాటు

ప్రతి మండలంలో రీసర్వే కోసం అవసరమైన ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. అందుబాటులో ఉన్న లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. రాబోయే ఏడాదిన్నర కాలంలో రాష్ట్రవ్యాప్తంగా మూడు విడతల్లో భూముల రీసర్వే ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ మేరకు జిల్లా కలెక్టర్లు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆదేశించారు.

రీసర్వే జరిగే సమయంలో సంబంధిత గ్రామాల రైతులకు ముందుగానే సమాచారం అందించాలని, స్థానిక రైతుల సమక్షంలోనే సర్వే ప్రక్రియ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

క్షుణ్ణంగా పరిశీలించాలి

అసైన్డ్ భూములకు సంబంధించి పట్టాలు అసలైనవా, నకిలీవా అనే అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని మంత్రి సూచించారు. పట్టా పొందిన వ్యక్తులే ప్రస్తుతం ఆ భూములపై ఆధీనంలో ఉన్నారా లేదా అనే విషయాన్ని నిర్ధారించాలని తెలిపారు. గతంలో ఒకరికి పట్టా ఇచ్చినప్పటికీ ప్రస్తుతం మరొకరు భూమిని



అనుభవిస్తున్నట్లయితే, ప్రస్తుత అనుభవదారుడు అర్హుడా కాదా అనే అంశాన్ని నిబంధనల ప్రకారం పరిశీలించాలని ఆదేశించారు. పట్టాలో పేర్కొన్న విస్తీర్ణానికి, క్షేత్రస్థాయిలో ఉన్న భూమి విస్తీర్ణానికి మధ్య తేడాలు ఉన్నాయా అనే విషయాన్ని కూడా క్షేత్రస్థాయిలో సరిచూసుకోవాలని తెలిపారు. సాగునీటి చెరువులు, రహదారులు, కుంటలు, ఇతర అభివృద్ధి పనుల కోసం గతంలో భూసేకరణ చేసిన భూములకు సంబంధించిన సర్వే నంబర్లలో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రీసర్వే ప్రక్రియలో ఎలాంటి సమస్యలు పెండింగ్‌లో ఉండకుండా అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా రెవిన్యూ అధికారి జయమ్మ, రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి,తదితరులు, పాల్గొన్నారు.

ఇంద్రపాలనగరం పాఠశాలలో ఓపెన్ జిమ్ ప్రారంభం

కోరమండల్ కంపెనీ సహకారంతో ఏర్పాటు.. ప్రారంభించిన సర్పంచ్ గర్దాస్ విక్రమ్

యాదాద్రి భువనగిరి జిల్లా నవంబర్ 11 వుదయం ప్రతినిధి




రామన్నపేట మండల లో ఇంద్రపాలనగరం విద్యార్థులు, గ్రామీణ యువత ఆరోగ్యంగా ఉండటంతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలనే లక్ష్యంతో కోరమండల్ కంపెనీ సహకారంతో ఇంద్రపాలనగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం జేఏసీ కార్యదర్శి, గ్రామ సర్పంచ్ గర్దాస్ విక్రమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, వ్యాయామంపై కూడా ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ఆరోగ్యకరమైన జీవనశైలికి వ్యాయామం ఎంతో అవసరమని, గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి సదుపాయాలు కల్పించేందుకు సహకరించిన కోరమండల్ కంపెనీ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా వ్యవసాయ అధికారి రమణారెడ్డి, ఏడీఏ బిక్షపతి, మండల వ్యవసాయ అధికారి ఏజే ఖాన్, కోరమండల్ వైస్ ప్రెసిడెంట్ భాస్కర్ రెడ్డి, హెచ్ఆర్ సుధాకర్, హైదరాబాద్ జోనల్ మేనేజర్ ప్రీతం స్వామీజీ, అగ్రోనమిస్టులు రామకృష్ణ, ప్రసాద్, రచన, సేల్స్ ఆఫీసర్ సాంబశివారెడ్డి, సాయిప్రసన్న పాల్గొన్నారు. అలాగే ఉపసర్పంచ్ నల్ల స్వామి జయసుధ, వార్డు సభ్యులు పరికుప్పల స్వామి, చిన్నలచ్చి శంకరమ్మ, రేపాక పారిజాత, వడ్లకొండ లక్ష్మి , పుట్టల లక్ష్మమ్మ, ముత్యాలు, కప్పల మంగమ్మ, రాజు, పంది మహాలక్ష్మి , మాజీ సర్పంచ్ కాటేపల్లి యాదయ్య, మందడి విద్యాసాగర్ రెడ్డి, రవ్వ నర్సింహా, మీర్ ఖాజా, రాజన్నగారి రమేష్, మంటిలింగస్వామి, గర్దాస్ వెంకటేష్, మందడి శ్రీధర్ రెడ్డి, ఈర్లపల్లి మల్లేశం, ఎండీ టీఎస్ నరేష్, గోపి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎస్ఆర్ ప్రైమ్ విద్యార్థి

అండర్–17 విభాగంలో చాణక్యరెడ్డి ప్రతిభ

నల్గొండ జిల్లా వుదయం ప్రతినిధి నవంబర్ 11



నల్గొండ పట్టణ కేంద్రంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఎంపిక పోటీల్లో ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్ విద్యార్థి చాణక్యరెడ్డి ప్రతిభ చాటారు. అండర్–17 బాలుర విభాగంలో విజేతగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మిర్యాలగూడ పట్టణంలోని క్లియో స్పోర్ట్స్‌లో బుధవారం ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని 14, 17 ఏళ్ల బాలబాలికలకు బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో చాణక్యరెడ్డి అత్యుత్తమ ఆటతీరుతో ప్రత్యర్థులను అధిగమించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ప్రస్తుతం ఆయన నల్లగొండలోని ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్‌లో విద్యనభ్యసిస్తున్నారు. చాణక్యరెడ్డికి శిక్షణ అందించిన కోచ్‌లు రామకృష్ణ, ప్రకాష్ నారాయణలను పలువురు అభినందించారు. ఎస్ఆర్ విద్యాసంస్థల స్కూల్ జోనల్ ఇన్‌చార్జి దోనల శ్రీనివాస్ రెడ్డి విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించి, రాష్ట్రస్థాయి పోటీల్లోనూ సత్తా చాటి విజయం సాధించాలని ఆకాంక్షించారు. జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

యువత స్వయం ఉపాధి సాధించేలా శిక్షణ పొందాలి

- **రూ.20 కోట్లతో నల్లగొండలో న్యాక్ కేంద్రం ఏర్పాటు**
- **మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి**

నల్గొండ జిల్లా వుదయం ప్రతినిధినవంబర్ 11:



నల్గొండ పట్టణ కేంద్రంలో యువత నైపుణ్యాలను పెంపొందించుకొని స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) కేంద్రంలో హైదరాబాద్ న్యాక్ డీజీ ఎం. శ్రీనివాస్ రెడ్డితో కలిసి శిక్షణ ప్రయోగశాలలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో నైపుణ్యాభివృద్ధితోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. మహిళలు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా న్యాక్ పనిచేస్తోందన్నారు. రాష్ట్రంలోనే ప్రత్యేకంగా నల్లగొండలో రూ.20 కోట్ల వ్యయంతో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో న్యాక్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం వివిధ కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు, యువతకు మేయర్, ఇతర ప్రముఖులు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాక్ డైరెక్టర్ ఎం. రాజిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎం.ఏ. హఫీజ్ ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ అమేర్, కార్పొరేటర్ మహమ్మద్ ఇబ్రహీం, వివిధ కంపెనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

యువత ప్రతిభకు యువజన ఉత్సవాలు వేదిక

నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్‌రెడ్డి

నల్గొండ జిల్లా నవంబర్ 11 వుదయం ప్రతినిధి



నల్గొండ పట్టణ కేంద్రంలో యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు యువజన ఉత్సవాలు చక్కని వేదికగా నిలుస్తాయని నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. విద్యతో పాటు కళలు, సాంస్కృతిక రంగాల్లోనూ యువత రాణించాలని ఆకాంక్షించారు. నల్లగొండ పట్టణంలోని కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి మెమోరియల్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు 2026–27 ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువత తమలోని సృజనాత్మకత, నైపుణ్యాలను ప్రదర్శించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. నేటి యువత దేశ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే శక్తిగా ఎదగాలని సూచించారు. ప్రతి ఒక్కరూ లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాలని అన్నారు. అన్ని రంగాల్లో ప్రతిభ చాటి నల్లగొండ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. యువతను ప్రోత్సహించి తగిన అవకాశాలు కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రమేష్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ అమీర్, ఆర్డీవో అశోక్‌రెడ్డి, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎండీ అక్బర్ అలీ, కళాశాల ప్రిన్సిపల్, పలువురు కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

గంగపుత్రుల హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలి



రాష్ట్రస్థాయి సమావేశంలో పూస బాలకిషన్ బెస్త పిలుపు

నల్గొండ జిల్లా నవంబర్ 11 వుదయం ప్రతినిధి

హైదరాబాద్ గంగపుత్రుల ఐక్యత, సంఘటిత శక్తితోనే సామాజిక అభివృద్ధి సాధ్యమని పూస బాలకిషన్ బెస్త అన్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో బుధవారం గంగపుత్ర సంఘం చైతన్య సమితి తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన నందిరి బాలయ్య గంగపుత్ర జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి పూస బాలకిషన్ బెస్త హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగపుత్రుల హక్కుల సాధన, సామాజిక అభివృద్ధి, సంఘం బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గంగపుత్రులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేయాలని సూచించారు. సంఘటితంగా ఉంటూ తమ హక్కులను సాధించుకోవాలని, భవిష్యత్ తరాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పేర్కొన్నారు.

అఖిల భారత కిసాన్ సభను జయప్రదం చేయాలి

15న నల్లగొండలో భారీ బహిరంగ సభ.. రామన్నపేట నుంచి రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాతు

యాదాద్రి భువనగిరి జిల్లా నవంబర్ 11 వుదయం ప్రతినిధి



యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం కేంద్రంలో అఖిల భారత కిసాన్ సభ జాతీయ మహాసభల సందర్భంగా ఈ నెల 15న నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బుర్రి అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు. సభకు యువతీ యువకులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. రామన్నపేట మండల కేంద్రంలో నిర్వహించిన రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాతు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బహిరంగ సభకు ముందు నిర్వహించే భారీ ప్రదర్శనలో పదివేల మంది రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాతు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని తెలిపారు. ఈ కవాతులో రామన్నపేట మండలం నుంచి యువకులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు మెట్టు శ్రావణ్, కార్యదర్శి శానగొండ రాము, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఈర్ల రాహుల్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్‌కుమార్, నాయకులు మేడి ముకుంద, అప్పం సురేందర్, ఎర్ర బిక్షపతి, పిట్టల నవీన్, చింతల రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి



మునగాల, నవంబర్ 11 (వుదయం):

అఖిల భారత రైతు సంఘం (ఏఐకేఎఫ్) 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని రైతు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. మండల రైతు సంఘం అధ్యక్షుడు చందా చంద్రయ్య అధ్యక్షతన మునగాల మండల వ్యాప్తంగా రెండు రోజులపాటు నిర్వహించిన ప్రచార కార్యక్రమానికి రైతు సంఘం రాష్ట్ర నాయకులు బుర్రి శ్రీరాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. నవంబర్ 15 నుంచి 18వ తేదీ వరకు నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగే 36వ జాతీయ మహాసభలకు దేశవ్యాప్తంగా వేలాది మంది రైతు ప్రతినిధులు హాజరుకానున్నారని వెల్లడించారు. తెలంగాణ రైతాంగం తమ ఐక్యతను చాటుతూ మహాసభలకు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. మునగాల మండలంలోని ప్రతి గ్రామం నుంచి రైతులు పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు మెదరమెట్ల వెంకటేశ్వరరావు, కార్యదర్శి స్టాలిన్ రెడ్డి, కలకోవ సర్పంచ్ మండవ వెంకటాద్రి, జిల్లా కమిటీ సభ్యులు జూలకంటి విజయలక్ష్మి , బచ్చుకూర స్వరాజ్యం, రామకృష్ణారెడ్డి, సుంకర పిచ్చయ్య, షేక్ సైదా, సోమపంగు జానయ్య, కిన్నెర వెంకన్న, మహిళా కోలాట బృందం, ప్రజానాట్యమండలి కళాకారులు, రైతులు, వివిధ పార్టీల నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మయ్య ఫౌండేషన్ వయోవృద్ధుల ఆశ్రమాన్ని సందర్శన

యాదాద్రి భువనగిరి జిల్లా, వుదయం ప్రతినిధి



జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, యాదాద్రి భువనగిరి కార్యదర్శి వి.మాధవి లత ఈరోజు చీమల కొండూరులోని బెజ్జ లక్ష్మయ్య ఫౌండేషన్ వయోవృద్ధుల ఆశ్రమాన్ని సందర్శించారు. ఆశ్రమంలో ఉంటున్న వయోవృద్ధుల యొక్క బాగోగులను మరియు ఆశ్రమ నిర్వాహకులు కలిపిస్తున్న వసతులపై అడిగి తెలుస్తున్నారు. వయోవృద్ధులు ఒంటరి వారి కారని వారి సంరక్షణకై చట్టం అన్ని హక్కులను కల్పించిందని వాటి ని సాధించుకోవటానికిమరియు అవకాశాలు సద్వినియోగం చేసుకునేటట్లుగా న్యాయ సేవా సంస్థ న్యాయ సేవలను అందజేస్తుందని తెలిపి ఆశ్రమంలో ఉంటున్న కొంతమంది వయోవృద్ధులకు పెన్షన్ ఇతర ప్రభుత్వ లబ్ధి రావట్లేదని తెలుసుకొని దానికై తగు న్యాయ సేవలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ ఇంచార్జ్, వయోవృద్ధులు పాల్గొన్నారు.



కోదండరాముడిని దర్శించుకున్న మంత్రి ఉత్తమ్

కోదాడ నవంబర్ 11 (వుదయం)


కోదాడ పట్టణంలోని శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేదమంత్రోచ్చారణల మధ్య పూజలు జరిపించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ నరసింహ, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మహమ్మద్ అతహర్‌కు టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి బాధ్యతలు

యాదాద్రి భువనగిరి జిల్లా. వుదయం ప్రతినిధి



భువనగిరి పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ అతహర్‌ను టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించారు. పార్టీ పట్ల ఆయనకున్న అంకితభావం, రాజకీయ అనుభవం, పార్టీ అభివృద్ధికి చేసిన సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ నియామకంపై భువనగిరి పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ మహమ్మద్ అతహర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



నల్లగొండకు 480 ఇందిరమ్మ టవర్స్ ఇళ్లు మంజూరు

- **జీవో 579 విడుదల.. ప్రభుత్వానికి**
- **మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్‌రెడ్డి కృతజ్ఞతలు**

నల్లగొండ, జిల్లా వుదయం ప్రతినిధి నవంబరు 11:

నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌కు 480 ఇందిరమ్మ టవర్స్ ఇళ్లను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 579 విడుదల చేయడంపై నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి నల్లగొండ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సొంత ఇళ్లు లేని నిరుపేద, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ టవర్స్ పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. పట్టణంలోని అర్హులైన పేద కుటుంబాలకు ఈ పథకం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.8.50 లక్షల వ్యయాన్ని నిర్ణయించగా, అర్హులైన లబ్ధిదారులకు రూ.5 లక్షల సబ్సిడీ అందించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని వెల్లడించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పట్టణ అభివృద్ధితోపాటు పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు కృషి చేస్తోందని మేయర్ పేర్కొన్నారు.

పట్టభద్రుల కోసం కొత్త ఇన్నింగ్స్

ప్రభుత్వ ఉద్యోగానికి వీఆర్ఎస్.. ఎమ్మెల్సీ బరిలోకి యర్కల శ్రీనివాస్ గౌడ్

నల్గొండ జిల్లా నవంబర్ 11 వుదయం ప్రతినిధి



నల్లగొండ: ప్రభుత్వ ఉన్నత ఉద్యోగాన్ని వీడి ప్రజా జీవితంలోకి అడుగుపెట్టేందుకు అటవీ శాఖ అధికారి యర్కల శ్రీనివాస్ గౌడ్ సిద్ధమయ్యారు. తెలంగాణ అటవీ శాఖలో అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్‌గా పనిచేస్తున్న ఆయన స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) కోరుతూ ప్రభుత్వానికి దరఖాస్తు సమర్పించారు. నల్లగొండ–ఖమ్మం–వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, పట్టభద్రుల సమస్యల పరిష్కారం, ఉద్యోగుల హక్కులు, ఉద్యోగ భద్రత, విద్యావ్యవస్థలో మార్పులు తీసుకురావడమే తన ప్రధాన లక్ష్యాలని వెల్లడించారు.

వీఆర్ఎస్ కోసం దరఖాస్తు

ప్రస్తుతం తెలంగాణ అటవీ శాఖలో అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్‌గా, ఆసిఫాబాద్ ఎఫ్‌డీఓ పరిధిలో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ గౌడ్.. ఈ నెల 26.10.2026 నుంచి స్వచ్ఛంద పదవీ విరమణ మంజూరు చేయాలని కోరుతూ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్‌కు దరఖాస్తు సమర్పించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తన అభ్యర్థనను పరిశీలించి ఆమోదించాలని కోరారు. అయితే వీఆర్ఎస్ దరఖాస్తుపై ప్రభుత్వ నిర్ణయం వెలువడాల్సి ఉంది.

స్వతంత్ర అభ్యర్థిగా పోటీ

నల్లగొండ–ఖమ్మం–వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేకుండా స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగాలని నిర్ణయించుకున్నారు. పట్టభద్రుల తరపున శాసనమండలిలో గొంతుకగా నిలిచి, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలన్నదే తన సంకల్పమని పేర్కొన్నారు.

ఆసక్తి రేపుతున్న నిర్ణయం

ప్రభుత్వ ఉన్నత హోదాలో ఉన్న అధికారి ఉద్యోగానికి వీఆర్ఎస్ కోరుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి సిద్ధమవడం ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. ఒకవైపు వీఆర్ఎస్ దరఖాస్తుపై ప్రభుత్వ ఆమోదం రావాల్సి ఉండగా.. మరోవైపు ఎన్నికల బరిలోకి దిగేందుకు ఆయన చేస్తున్న ప్రకటనలు చర్చనీయాంశంగా మారాయి. పట్టభద్రులు ఆయన అభ్యర్థిత్వాన్ని ఏ మేరకు ఆదరిస్తారో వేచి చూడాలి.

సన్నవడ్ల ధరలు భారీగా పతనం.. కష్టాల్లో రైతులు

- **రూ.5 వేల నుంచి రూ.2,500కు పడిపోయిన క్వింటాల్ ధర**
- **వ్యాపారులు, మిల్లర్ల ధరల ఎత్తుగడలతో అన్నదాతకు కన్నీళ్లే మిగులు..**
- **పెట్టుబడులు కూడా దక్కని దుస్థితి!**



అనంతగిరి నవంబర్ 11 వుదయం

వరి కోతల సీజన్ ప్రారంభంలో సన్నవడ్లకు క్వింటాలుకు రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు ధర పలకడంతో ఆశలు పెంచుకున్న అనంతగిరి మండల రైతులకు ఇప్పుడు నిరాశే మిగులుతోంది. ధాన్యం మార్కెట్‌కు భారీగా చేరుతుండటంతో కొన్నిచోట్ల ధరలు ఒక్కసారిగా క్వింటాలుకు రూ.2,500కు పడిపోవడం రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.సీజన్ ప్రారంభంలో అధిక ధరలతో రైతులను ఆకర్షించిన వ్యాపారులు, మిల్లర్లు హార్వెస్టర్ యజమానుల ద్వారా ముందుగానే పంట వివరాలు సేకరించి, గ్రామాల్లో ఏజెంట్లను ఏర్పాటు చేసి, అడ్వాన్సులు ఇచ్చి మరీ పొలాల వద్దకే వెళ్లి పచ్చి ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. అయితే ధాన్యం చేతికొచ్చి మార్కెట్‌కు చేరుతున్న ప్రస్తుత తరుణంలో ధరలు తగ్గుతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.అనంతగిరి మండలంలోని వరి రైతులు ఎకరాకు వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పంట సాగు చేయగా తీరా పంట అమ్ముకునే సమయంలో ధరలు పడిపోవడంతో పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. వ్యాపారులు, మిల్లర్లు కుమ్మక్కై ధరలు తగ్గిస్తున్నారనే అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి...ఆశ చూపించి.. కోతల వేళ ధర తగ్గిస్తే రైతు పరిస్థితి ఏమిటి అన్న ప్రశ్న అన్నదాతలను వేధిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ధాన్యం కొనుగోళ్లపై పర్యవేక్షణ చేపట్టి, సన్నవడ్లకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని అనంతగిరి మండల రైతులు కోరుతున్నారు.

ప్రాణరక్షణ సేవలకు ప్రశంసాపత్రం

దమ్మపేట ఫైర్ ఫైటర్‌కు అరుదైన గుర్తింపు

దమ్మపేట నవంబర్ 11 (వుదయం ప్రతినిధి):



సత్తుపల్లి మండలం బేతపల్లి చెరువు వద్ద జరిగిన ప్రమాదంలో చిక్కుకున్న వారిని సురక్షితంగా కాపాడటంలో కీలక పాత్ర పోషించిన దమ్మపేట గ్రామానికి చెందిన ఫైర్ ఫైటర్ తోట చెన్నారావుకు ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు లభించాయి. ఆయన అందించిన సేవలను గుర్తించిన ఫైర్ సర్వీస్ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్, ఐపీఎస్ చేతుల మీదుగా అప్రిసియేషన్ సర్టిఫికెట్ అందుకున్నారు. ఆపద సమయంలో సమయస్ఫూర్తితో వ్యవహరించి ప్రమాదంలో చిక్కుకున్న వారిని రక్షించడంలో కీలకంగా వ్యవహరించిన చెన్నారావుకు గుర్తింపు లభించడం పట్ల దమ్మపేట ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అన్నదానం మహోన్నతమైన పుణ్యకార్యం

చిలుకూరు, నవంబర్ 11:(వుదయం)



నియమ నిష్ఠలతో అయ్యప్ప దీక్షలో ఉన్న స్వాములతో పాటు ఇతర భక్తులకు అన్నదానం చేయడం ఎంతో గొప్ప పుణ్యకార్యమని మీడియా టుడే దినపత్రిక జిల్లా స్టాఫర్ అమరగాని కృష్ణ అన్నారు. బుధవారం చిలుకూరు మండల పరిధిలోని రామాపురం గ్రామంలో తన నివాసంలో అయ్యప్ప స్వామి పూజా కార్యక్రమం నిర్వహించినారు అనంతరం స్వామివారికి పాలాభిషేకం పల్లకి సేవ నిర్వహించినారు అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వార్థం లేని సేవాభావంతో భక్తులకు అన్నం పెట్టడం దైవసేవతో సమానమని పేర్కొన్నారు.

ఆదిలాబాద్‌ను ఐటీ, పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దుతాం

- **యువతకు జిల్లాలోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు**
- **త్వరలో విమానాశ్రయానికి శంకుస్థాపన**
- **ఐటీ టవర్ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు**

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, నవంబర్ 11 :

ఆదిలాబాద్ జిల్లాను ఐటీ, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి చేసి స్థానిక యువతకు ఇక్కడే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఉద్యోగాల కోసం హైదరాబాద్, ఇతర నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా జిల్లాలోనే ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో రూ.58.85 కోట్లతో నిర్మించిన నూతన ఐటీ టవర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్‌కే పరిమితమైన ఐటీ రంగాన్ని ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు విస్తరిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో ఐటీ టవర్ నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఇందులో టాస్క్ శిక్షణ కేంద్రం, ఇంక్యుబేషన్ హబ్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఎన్‌టిటి డేటాలో 300 మంది, ఎన్ ల్యాబ్స్‌లో 250 మంది, పోస్ట్రిట్ ఏఐలో 50 మంది, వైడర్ సాఫ్ట్‌వేర్‌లో 20 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. మొత్తం 620 మందికి తొలి విడతలో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

3 వేల ఎకరాల్లో పారిశ్రామిక కారిడార్

ఆదిలాబాద్ పారిశ్రామిక అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామని మంత్రి తెలిపారు. జిల్లాలో 3 వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. తొలి విడతలో 2 వేల ఎకరాలు, రెండో విడతలో మరో వెయ్యి ఎకరాల భూసేకరణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను ఆదేశించినట్లు వెల్లడించారు. పరిశ్రమలు వస్తే స్థానికంగా ఉద్యోగాలు పెరగడంతో పాటు జిల్లా ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు.

విమానాశ్రయం, సీసీఐపై ప్రత్యేక దృష్టి

ఆదిలాబాద్‌లో విమానాశ్రయ నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ, అనుమతుల ప్రక్రియ కొనసాగుతోందని, త్వరలోనే శంకుస్థాపన చేస్తామని మంత్రి వెల్లడించారు. దశాబ్దాలుగా మూతపడిన సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పరిశ్రమ పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నామని తెలిపారు. ఈ పరిశ్రమ తిరిగి ప్రారంభమైతే స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్, ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి గాండ్లత్ సుజాత, మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవ్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్, మార్కెట్ కమిటీ చైర్మన్ బొరంచు శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర ఐటీ శాఖ అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌కు మరో ఐటీ టవర్ మంజూరు చేయాలి

ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, నవంబర్ 11 :

ఆదిలాబాద్‌లో ఐటీ రంగం అభివృద్ధికి పెరుగుతున్న అవకాశాలను దృష్టిలో ఉంచుకుని మరో ఐటీ టవర్‌ను మంజూరు చేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబును కోరారు. బుధవారం ఆదిలాబాద్‌లో నూతనంగా నిర్మించిన ఐటీ టవర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ మేరకు పలు విజ్ఞప్తులు చేశారు. ప్రస్తుతం ఉన్న ఐటీ టవర్ పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నందున పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా మరో టవర్ అవసరమని పేర్కొన్నారు. స్థానిక యువ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు ఐటీ కంపెనీలు స్థాపించేలా ప్రత్యేక రాయితీలు, ప్రోత్సాహకాలు కల్పించాలని కోరారు. పొరుగు మహారాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు సబ్సిడీలు అందిస్తుండటంతో పత్తి ఆధారిత పరిశ్రమలు సైతం అక్కడికి తరలిపోతున్నాయని ప్రస్తావించారు. తెలంగాణ ప్రభుత్వం కూడా ఆదిలాబాద్‌కు ప్రత్యేక పారిశ్రామిక రాయితీలు ప్రకటించి పెట్టుబడులను ఆకర్షించాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక విద్యార్థులకు ఉన్నత సాంకేతిక విద్య అందుబాటులోకి తీసుకురావడానికి ఆదిలాబాద్‌లో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. ఐటీ, పారిశ్రామిక, విద్యారంగాల్లో తగిన ప్రోత్సాహం లభిస్తే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు జిల్లా ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుందని పాయల్ శంకర్ పేర్కొన్నారు.



ప్రభుత్వ ఆసుపత్రిలో జనరిక్ మెడికల్ స్టోర్ ప్రారంభం

కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభం..
రోగులకు తక్కువ ధరలకే మందులు

ఆసిఫాబాద్, : నవంబర్ 11 :

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జనరిక్ మెడికల్ స్టోర్‌ను జిల్లా కలెక్టర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్ కిరణ్, ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకట్ లక్కావత్ మాట్లాడుతూ జనరిక్ మందులు తక్కువ ధరలకు అందుబాటులోకి రావడం పేద, మధ్యతరగతి రోగులకు ఎంతో ప్రయోజనకరమని తెలిపారు. మందుల ఖర్చు భారం తగ్గించుకోవడానికి ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం ఆసుపత్రిలో రోగుల కోసం ఏర్పాటు చేసిన వేచి ఉండే షెడ్డు, విద్యుత్ సమస్య పరిష్కారానికి ఏర్పాటు చేసిన ఇన్వర్టర్లు, జనరేటర్ మరమ్మతు పనులను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణ, ఆర్ఎంవోలు డాక్టర్ తిరుమలేశ్, డాక్టర్ స్రవంతి, చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ విజయమ్మ, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



రైతులను బ్యాంకర్లు వేధించడం ఆపాలి.. నష్టపరిహారం అందించాలి

మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, నవంబర్ 11 :

ఓవైపు పంట నష్టాలు.. మరోవైపు అప్పుల భారం.. ఈ పరిస్థితుల్లో రైతులకు అండగా నిలవాల్సిన బ్యాంకు అధికారులు రుణాల వసూళ్ల పేరుతో వారి ఇళ్లకు వెళ్లి ఒత్తిడి చేయడం ఏమిటని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ప్రశ్నించారు. కరువు పరిస్థితుల్లో రైతు కుటుంబాలను ఇబ్బందులకు గురిచేయడం మానుకోవాలని డీసీసీబీ అధికారులకు సూచించారు. బుధవారం జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో పత్తి, సోయా పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. కరువు ప్రాంతంగా ప్రకటించినా ఇప్పటివరకు పరిహారం అందించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. పంట నష్టపరిహారంపై ఇచ్చిన హామీలను అమలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను జిల్లా పర్యటనకు వస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ సమావేశంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



డివిజన్ స్థాయి క్రీడా ఎంపికలు విజయవంతం

జోనల్ పోటీలకు ప్రతిభావంతుల ఎంపిక

ఆసిఫాబాద్ నవంబర్ 11:

ఆసిఫాబాద్ జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని స్పోర్ట్స్ స్కూల్ గ్రౌండ్‌లో ఆసిఫాబాద్ డివిజన్ స్థాయి క్రీడా ఎంపిక పోటీలు నిర్వహించారు. ఏ టీ డీ ఓ చిరంజీవి, జిల్లా క్రీడల అధికారి మడావి షేకు పర్యవేక్షణలో పోటీలు జరిగాయి.హాజరైన ఎ సి ఎం ఓ ఉద్ధవ్ మాట్లాడుతూ, క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంచుతాయన్నారు. ఏకాగ్రత పెరిగి చదువుల్లోనూ మంచి ఫలితాలు వస్తాయని, విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు.జిల్లా గిరిజన సంక్షేమ అధికారి అంబాజీ ఆదేశాల మేరకు పోటీలు నిర్వహించినట్లు ఏ టీ డీ ఓ చిరంజీవి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు జోనల్ స్థాయి పోటీల్లో ఆసిఫాబాద్ డివిజన్ తరపున ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. వారిని అతిథులు అభినందించి, జోనల్ స్థాయిలోనూ రాణించి డివిజన్‌కు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లింబారావు, పీడీ మీనా రెడ్డి, ఉపాధ్యాయులు జంగు, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు బ్రహ్మం, పీడీలు లక్ష్మణ్, కృష్ణమూర్తి, మంగావతి, సుభాష్, అరవింద్, ధనరాజ్, శ్రీనివాస్, పాండురంగ్, మహదు, కోచ్‌లు అరవింద్, తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి శ్రీధర్‌బాబుకు ఘన స్వాగతం పలికిన నరేష్ జాదవ్

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, నవంబర్ 11 :

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఐటీ టవర్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు హెలిప్యాడ్ వద్ద ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి ఆత్మీయంగా ఆహ్వానించారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబును కలిసి జిల్లా కాంగ్రెస్ పార్టీ తరపున శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదిలాబాద్ జిల్లాలో నూతన ఐటీ టవర్ ప్రారంభంతో ఐటీ రంగ అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని, స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు జిల్లాలో పారిశ్రామిక, సాంకేతిక అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఐటీ రంగాన్ని జిల్లాలో విస్తరించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్, మార్కెట్ కమిటీ చైర్మన్ బొరంచు శ్రీకాంత్ రెడ్డి, టీపీసీసీ కార్యవర్గ సభ్యురాలు గండ్రత్ సుజాత, సాజిద్ ఖాన్, మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి తదితరులు పాల్గొని మంత్రి శ్రీధర్‌బాబుకు ఘన స్వాగతం పలికారు. పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.





విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు

కలెక్టర్ కుమార్ దీపక్

లక్షెట్టిపేట, నవంబర్ 11 (వుదయం న్యూస్):

విద్యతోనే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల విద్యాలయంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా వార్షిక క్రీడా దినోత్సవానికి ఆర్‌సీఓ శ్రీధర్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... విద్యార్థులు క్రమశిక్షణ, అంకిత భావం, నిరంతర సాధనతో లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు.అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి జీఓ 58, 59, 76 దరఖాస్తులు, భూభారతి, భూముల రీ-సర్వే, కళ్యాణలక్ష్మి , షాదీ ముబారక్ పథకాల అమలుపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించి అర్హులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ మంగ, సంబంధిత అధికారులు, క్రీడాకారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ కిష్టయ్యకు అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి

కామారెడ్డి, నవంబర్ 11 (వుదయం ప్రతినిధి):-



ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల స్వయం ప్రతిపత్తి వైస్ ప్రిన్సిపల్, రాజనీతి శాస్త్ర విభాగం అధిపతి డాక్టర్ కె. కిష్టయ్య అసిస్టెంట్ ప్రొఫెసర్ స్థాయి నుండి అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.విజయ్ కుమార్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె.విజయ్ కుమార్ మాట్లాడుతూ..డాక్టర్ కె. కిష్టయ్య నిబద్ధత, క్రమశిక్షణ కలిగిన అధ్యాపకులు. వైస్ ప్రిన్సిపల్‌గా, రాజనీతి శాస్త్ర విభాగాధిపతిగా, కళాశాల పరీక్షల నియంత్రణ అధికారిగా , పరిపాలనా పురోగతికి వారు అందిస్తున్న సేవలు ప్రశంసనీయం. బోధనా రంగంలో ఎంతో అనుభవం ఉన్న ఆయనకు అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి లభించడం కళాశాలకు ఎంతో గర్వకారణం. భవిష్యత్తులో వారు విద్యార్థులకు మరిన్ని సేవలు అందిస్తూ, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం డాక్టర్ కె. కిష్టయ్యకు అభినందనలు తెలియజేశారు.



గొర్రెలు,మేకల మాంసం విక్రయాలపై తనిఖీలు

నాగిరెడ్డిపేట్,వుదయం

గోపాల్‌పేట్ గ్రామంలోని మటన్ దుకాణాలను బుధవారం పశువైద్యాధికారులు తనిఖీ చేశారు. వ్యాధిగ్రస్త గొర్రెలు, మేకలను వధించి వాటి మాంసాన్ని వినియోగదారులకు విక్రయిస్తున్నారనే ఫిర్యాదు మేరకు ఈ తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా మటన్ దుకాణాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ తనిఖీల్లో పశువైద్య సహాయ శస్త్రచికిత్సాధికారి డాక్టర్ రవికుమార్, పంచాయతీ కార్యదర్శి సలీం, పశువైద్య సిబ్బంది గౌస్, గంగారం పాల్గొన్నారు.

పశుసంవర్ధక అంబులెన్స్‌తో ఆవుకు సురక్షిత ప్రసవం

రెబ్బెన, నవంబర్ 11 (వూదయం):



రెబ్బెన మండలం గొల్లేటి గ్రామంలో బుధవారం రోజున ప్రసవ వేదనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆవుకు పశుసంవర్ధక అంబులెన్స్ సిబ్బంది సకాలంలో వైద్యసేవలు అందించి సురక్షితంగా ప్రసవం జరిగేలా సహకరించారు. ఆవు ప్రసవంలో ఇబ్బందులు పడుతుండటాన్ని గమనించిన గ్రామస్థులు వెంటనే పశుసంవర్ధక అంబులెన్స్‌కు సమాచారం అందించారు. స్పందించిన అంబులెన్స్ సిబ్బంది హుటాహుటిన గ్రామానికి చేరుకుని ఆవు పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ ఫీల్డ్ ఆఫీసర్ గురుపదం అత్యవసర ప్రసూతి చికిత్స అందించి ఆవు సురక్షితంగా దూడకు జన్మనిచ్చేలా చర్యలు చేపట్టారు. వైద్యసేవలు సకాలంలో అందడంతో ఆవు, దూడ రెండూ ఆరోగ్యంగా ఉన్నాయని తెలిపారు. అత్యవసర సమయంలో అందుబాటులోకి వచ్చి పశువుల ప్రాణాలను కాపాడుతున్న ప్రభుత్వ అంబులెన్స్ సేవలపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. పశువులకు అత్యవసర వైద్యసేవలు అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని ఫీల్డ్ ఆఫీసర్ గురుపదం, వివేకానంద పేర్కొన్నారు.

పోచారం ప్రాజెక్టు నీటి విడుదలపై తైబందీ సమావేశం

నాగిరెడ్డిపేట,వుదయం



పోచారం ప్రాజెక్టు నుంచి యాసంగి 2026 సీజన్‌లో నీటి విడుదలకు గల అవకాశాలు, ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో రైతులు అనుసరించాల్సిన పంటల సాగు విధానంపై చర్చించేందుకు ఈ నెల 13వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు నాగిరెడ్డిపేట మండల పరిషత్ అభివృద్ధి అధికారి (MPDO) కార్యాలయ సమావేశ మందిరంలో తైబందీ సమావేశం నిర్వహించనున్నట్లు నీటిపారుదల శాఖ ఎల్లారెడ్డి కార్యనిర్వాహక ఇంజనీర్ షేర్ల వెంకటేశ్వర్లు తెలిపారు.ఈ సమావేశంలో పోచారం ప్రాజెక్టు నుంచి నీటి విడుదలకు ఉన్న అవకాశాలు, యాసంగి పంటల సాగుకు సంబంధించి తీసుకోవాల్సిన నిర్ణయాలు, ఆయకట్టు పరిధిలో రైతులు అనుసరించాల్సిన పంటల విధానంపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.ఈ సమావేశానికి పోచారం ప్రాజెక్టు ఆయకట్టుదారులందరూ, స్థానిక ప్రజాప్రతినిధులైన సర్పంచులు, పీఏసీఎస్ చైర్మన్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ తదితరులు, వ్యవసాయ, రెవెన్యూ, మండల పరిషత్ అభివృద్ధి శాఖల అధికారులు, సకాలంలో హాజరుకావాలని కార్యనిర్వాహక ఇంజనీర్ షేర్ల వెంకటేశ్వర్లు కోరారు.

గోవెన–బాలన్‌పూర్ రహదారికి మరమ్మతులు చేపట్టాలి

మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు సర్పంచ్, ఉపసర్పంచ్ వినతి

తిర్యాణి, : నవంబర్ 11 :



గోవెన గ్రామం నుంచి బాలన్‌పూర్‌కు వెళ్లే ప్రధాన రహదారికి మరమ్మతులు చేపట్టాలని కోరుతూ గోవెన సర్పంచ్ ముచ్చినేని ఎర్రయ్య, ఉపసర్పంచ్ కనక మోతిరామ్ బుధవారం మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు వినతిపత్రం అందజేశారు. రహదారి పూర్తిగా దెబ్బతినడంతో గ్రామస్థులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. గ్రామానికి నూతన పంచాయతీ భవనం, అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయాలని కోరారు. అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆత్రం సక్కు హామీ ఇచ్చినట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో రొంటసంకెపల్లి సర్పంచ్ ఆత్రం కొండు, తుంపల్లి సర్పంచ్ టెకం ఈశ్వరిబాయి, ఎల్లారం సర్పంచ్ కాతిలే నీలాబాయి, వెంకటాపూర్ సర్పంచ్ వెడ్మ నీలాబాయి పాల్గొన్నారు.

మిట్టపల్లి, గుల్లకోటలో పనులపై అదనపు కలెక్టర్ సమీక్ష

లక్షెట్టిపేట, నవంబర్ 11 (వుదయం న్యూస్):



లక్షెట్టిపేట మండలంలోని మిట్టపల్లి, గుల్లకోట గ్రామ పంచాయతీల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతిని సమీక్షించారు.పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రోడ్ల నిర్మాణం, పారిశుధ్యం, ఇంకుడు గుంతలు, సోక్ పిట్స్ పనులను పరిశీలించారు. ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత నిర్మించాలని, ప్రభుత్వ భవనాలకు కమ్యూనిటీ సోక్ పిట్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జి. అనిల్ కుమార్, సర్పంచులు బానేష్, దేవమణి, ఏపీఓ వేణుగోపాల్, పంచాయతీ కార్యదర్శులు, వార్డు సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఓ బి సి అధ్యక్షుడిగా దందెర విలాస్

ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)



కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలం బిజెపి పార్టీ ఓ బి సి అధ్యక్షుడిగా పాపన్నపేట గ్రామానికి చెందిన దగ్గర విలాస్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం ఆధ్వర్యంలో ఓ బి సి మోర్చా జిల్లా ఇన్చార్జి విష్ణు దత్తు పర్యవేక్షణలో ఓబీసీ జిల్లా అధ్యక్షులు ఎలుకరి దామోదర్ అధ్యక్షతన ఎంపిక జరిగిందన్నారు. తనపై నమ్మకంతో బెజ్జూరు మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించినందుకు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ,జిల్లా అధ్యక్షులు ధోని శ్రీశైలం ,ఓబిసి జిల్లా అధ్యక్షులు ఎలకరి దామోదర్ లకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం శాలువాతో సన్మానించారు.

మౌలానా ఆజాద్ ఆశయాలు నేటి తరానికి ఆదర్శం



మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్


ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, నవంబర్ 11 :

భారతదేశ తొలి కేంద్ర విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ 138వ జయంతిని పురస్కరించుకుని ఆదిలాబాద్ కలెక్టరేట్‌లోని కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన జాతీయ విద్యా దినోత్సవం, మైనారిటీల సంక్షేమ దినోత్సవ వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ విద్యారంగ అభివృద్ధికి మౌలానా ఆజాద్ చేసిన సేవలు చిరస్మరణీయమని, ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య అందించాలనే ఆయన ఆశయం నేటి తరానికి ఆదర్శమని అన్నారు. విద్యతోనే వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజ, దేశ ప్రగతి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. పేద, బలహీన వర్గాలు, మైనారిటీ విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న విద్యా సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ఈఎన్‌టీ సదరం–యూడీఐడీ వైద్య శిబిరం


దివ్యాంగులకు ప్రత్యేక పరీక్షలు.. అర్హులకు ధ్రువీకరణ ప్రక్రియ

ఆసిఫాబాద్ :నవంబర్ 11 :



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో బుధవారం ఈఎన్‌టీ సదరం–యూడీఐడీ వైద్య శిబిరం నిర్వహించారు. చెవి, ముక్కు, గొంతు సమస్యలు, వినికిడి లోపం ఉన్నవారికి ఈఎన్‌టీ నిపుణుడు డాక్టర్ ఎండీ షోయల్, ఆడియోమెట్రిక్ టెక్నీషియన్ డాక్టర్ రాఘవేంద్ర వైద్య పరీక్షలు నిర్వహించి దివ్యాంగత్వ నిర్ధారణకు అవసరమైన అంచనాలు చేపట్టారు. శిబిరాన్ని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్ కిరణ్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకట్ లక్కావత్ సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. అర్హులైన దివ్యాంగులకు సదరం–యూడీఐడీ ధ్రువీకరణ ప్రక్రియను సులభతరం చేయడమే శిబిరం లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎంవోలు డాక్టర్ తిరుమలేశ్, డాక్టర్ స్రవంతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సిలువగుట్ట మట్టి తవ్వకాలపై సీపీఐ ఆందోళన



లక్షెట్టిపేట, నవంబర్ 11 (వుదయం న్యూస్) :

మోదల గ్రామ శివారులోని సిలువగుట్టపై అక్రమంగా మట్టి తవ్వి తరలించడాన్ని నిరసిస్తూ సీపీఐ నాయకులు ఆందోళనకు దిగారు. బుధవారం మట్టి తరలిస్తున్న టిప్పర్లను స్థానిక సబ్‌స్టేషన్ వద్ద అడ్డుకొని నిరసన తెలిపారు.ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ.. సిలువగుట్టపై అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరుగుతున్నా అధికారులు స్పందించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ తవ్వకాల వల్ల గుట్టకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని తెలిపారు.

సంబంధిత మైనింగ్ శాఖ అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలించి తవ్వకాలను నిలిపివేయాలని, అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి మేదరి దేవావరం, పట్టణ కార్యదర్శి ఆవునూరి వెంకటేష్, కేతిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల గడి బురుజు స్థలాన్ని కాపాడే వరకు నా పోరాటం ఆగదు

ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

కోరుట్ల నవంబర్ 11 (వుదయం ప్రతినిధి)



కోరుట్ల పట్టణ చారిత్రక గుర్తింపుగా నిలిచిన గడి బురుజు స్థలాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కోరుట్ల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు గడి బురుజు స్థలాన్ని కొంతమంది వ్యక్తులు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారనే అంశంపై ఎమ్మెల్యే సంజయ్ స్పందిస్తూ ప్రజల ఆస్తులను కాపాడటం తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు గడి బురుజు స్థలానికి సంబంధించిన వి ఎల్ టి రద్దు అయ్యే వరకు తన పోరాటం ఆగదని స్పష్టం చేశారు ఈ వ్యవహారంలో తమ పార్టీకి చెందిన నాయకులు లేదా కార్యకర్తల ప్రమేయం ఉన్నా ఉపేక్షించే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు పార్టీకి చెందిన వారైనా సరే ప్రజా ఆస్తుల పరిరక్షణకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అవసరమైతే వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు ప్రజలకు చెందాల్సిన ఆస్తుల విషయంలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా చూడాలని గడి బురుజు స్థలాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు గడి బురుజు స్థల పరిరక్షణ కోసం చేపట్టిన పోరాటం ఇది కేవలం ఆరంభం మాత్రమేనని ప్రజల ఆస్తులను కాపాడే విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ స్పష్టం చేశారు

పుష్కర ఘాటు పనుల పరిశీలన

కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు

కోరుట్ల నవంబర్ 11 (వుదయం ప్రతినిధి)



మల్లాపూర్ మండలం పాత దామరాజు పల్లి గ్రామంలో జరుగుతున్న పుష్కర ఘాట్ పనులను బుధవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుష్కరాల సందర్భంగా వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా పనులు నాణ్యతతో త్వరగా చేపట్టాలని అధికారులను కోరారు ఇంకా ఏమైనా నిధులు అవసరం ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే నిధుల మంజూరుకు తప్పకుండా కృషి చేస్తామన్నారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న తండా సర్పంచ్ సురేష్ ఉప సర్పంచ్ శ్రీనివాస్ బాల్కొండ సర్పంచ్ వసంత జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు జలపతి రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాట్ల సోమయ్య నాయకులు కిరణ్ జమాల్ రాజేందర్ రవి కిషన్ కాంగ్రెస్ పార్టీ వివిధ హోదా నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ మీసా కోరుట్ల డివిజన్ శాఖ తరపున జాతీయ విద్యా దినోత్సవం

కోరుట్ల నవంబర్ 11 (వుదయం ప్రతినిధి)



తెలంగాణ స్టేట్ మైనారిటీ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ కోరుట్ల డివిజన్ శాఖ తరపున జాతీయ విద్యా దినోత్సవం భారత రత్న మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జన్మదినం సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కాలేజ్ కోరుట్లలో నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆర్డీవో జీవాకర్ రెడ్డి మండల విద్యాధికారి గంగుల నరేష్ ఇన్చార్జి ప్రిన్సిపాల్ నటరాజ్ ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ బారి కోరుట్ల మున్సిపల్ వైస్ చైర్మన్ షాహిదుల్ ఆహద్ టీఎస్ మీసా స్టేట్ కౌన్సిల్ మెంబర్ ఎండి ఫసీఉద్దీన్ షకీల్ టీఎస్ మీసా కోరుట్ల అధ్యక్షులు హమీదుల్లా ఖాన్ కార్యదర్శి ఆమీర్ సోహెల్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ 14 సంవత్సరాలు నిండిన ప్రతి పిల్లవాడు విద్యనభ్యసించాలని మనకు ఆర్ టి ఐ చెబుతుంది కానీ ఈ విషయాన్ని మనకు ఎప్పుడో మౌలాన అబుల్ కలామ్ ఆజాద్ కలాం చెప్పారని కొనియాడారు మిగతా వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులను అభ్యసించి భవిష్యత్తులో గొప్ప స్థానంలో ఉండాలని ఆకాంక్షించారు చదువులో ముందంజలో ఉన్న విద్యార్థులను బహుమతులతో సత్కరించారు.

పంట కోత ప్రయోగాలను క్షేత్ర స్థాయిలో పరిశీలన

జగిత్యాల నవంబర్ 11 (వుదయం ప్రతినిధి)



జగిత్యాల జిల్లాలో పంట కోత ప్రయోగాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన రాష్ట్ర గణాంక శాఖ అధికారులు జగిత్యాల జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి జి సత్యం ఆధ్వర్యంలో హైదరాబాద్ రాష్ట్ర గణాంక శాఖకు చెందిన గణాంక అధికారి వి శ్రీనివాస్ ఉప గణాంక అధికారి పులి రాజు జగిత్యాల జిల్లాలో పర్యటించి క్షేత్ర స్థాయిలో నిర్వహిస్తున్న పంట కోత ప్రయోగాలను పరిశీలించారు ఈ కార్యక్రమంలో జిల్లా గణాంక అధికారి (ఎస్ఓ) వేణుగోపాల్ ఉప గణాంక అధికారులు టి నరేష్ డి రాజేష్ కె మధు గజేంద్ర ప్రసాద్ మండల ప్రణాళిక గణాంక అధికారులు (ఎంపిఎస్ఓలు) వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) పాల్గొన్నారు ఈ సందర్భంగా జిల్లాలోని కోడిమ్యాల మండలం తిప్పాయిపల్లి గ్రామం వెల్గటూర్ మండలం బెర్సాని గ్రామం మెట్‌పల్లి మండలం విత్తంపేట గ్రామాలలో పర్యటించి వరి పంట దిగుబడుల అంచనా కోసం నిర్వహించిన పంట కోత ప్రయోగాల ప్రక్రియను పరిశీలించారు ఈ సందర్భంగా సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) మండల ప్రణాళిక గణాంక అధికారులు (ఎంపిఎస్ఓలు) ప్రభుత్వ మార్గదర్శకాలు నిర్దేశిత నిబంధనలకు అనుగుణంగా పంట కోత ప్రయోగాలను పారదర్శకంగా ఖచ్చితత్వంతో నిర్వహించాలని సూచించారు పంట కోత ప్రయోగాల ద్వారా సేకరించిన దిగుబడి వివరాలు అత్యంత ప్రాధాన్యత కలిగి ఉంటాయని ఈ ఫలితాల ఆధారంగానే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగంలో పంట దిగుబడులను అంచనా వేసి, తదనుగుణంగా వివిధ వ్యవసాయ ప్రణాళికలు విధానాలు కార్యక్రమాలను రూపొందిస్తాయని తెలిపారు అనంతరం జగిత్యాల జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడిఓసి)లోని ముఖ్య ప్రణాళికాధికారి కార్యాలయంలో ప్రణాళిక శాఖ సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించి పంట కోత ప్రయోగాల నిర్వహణ డేటా నమోదు ఫలితాల ఖచ్చితత్వం ప్రభుత్వ మార్గదర్శకాల అమలుపై సమీక్షించారు

పాత్రికేయులు శ్రీనివాస్ ను పరామర్శించిన జువ్వాడి కృష్ణారావు

కోరుట్ల నవంబర్ 10 (వుదయం ప్రతినిధి)



కోరుట్ల పట్టణానికి చెందిన వుదయం పాత్రికేయులు నంద్యాడపు శ్రీనివాస్ అనారోగ్య సమస్యతో ఆసుపత్రి లో చికత్స పొంది ఇటీవల ఇంటికి వచ్చిన ఆయనను కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు మంగళవారం రాత్రి శ్రీనివాస్ ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు శ్రీనివాస్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించినట్లు తెలిపారు ఈ పరామర్శలో కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కొంతం రాజం తదితరులు పాల్గొన్నారు.

మహా పాదయాత్ర విజయవంతానికి బీజేపీ మల్యాల మండల సన్నాహక సమావేశం

మల్యాల మండలం నవంబర్ 11 (వుదయం ప్రతినిధి)



మల్యాల మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షులు గాజుల మల్లేశం ఆధ్వర్యంలో " మహా పాదయాత్ర " సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి పాల్గొని , ఈ సందర్భంగా నవంబర్ 18న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహా పాదయాత్రకు బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నవీన్ హాజరుకానున్న నేపథ్యంలో, మల్యాల మండలం నుంచి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చి పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బింగివేణు. తక్కలపల్లి సర్పంచ్ లత , మద్దుట్ల సర్పంచ్ సంకుర్తి తిరుపతి , ఉప సర్పంచులు మల్లేశం , వినోద్ , బీజేవైఎం మండల అధ్యక్షుడు పొన్నగంటి గౌతం , మహిళ మోర్చా అధ్యక్షురాలు కటకం లత, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు సుంకపాక టైటాన్స్ , రమ, పరశురాం, బూత్ అధ్యక్షులు కార్యకర్తలు పాల్గొన్నారు.

భూముల రీసర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

- **మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**
- **భూముల రీసర్వే ప్రక్రియపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

జగిత్యాల నవంబర్ 11 (వుదయం ప్రతినిధి)



రాష్ట్రంలో భూముల రీసర్వే ప్రక్రియను ప్రజలకు మేలు జరిగేలా సానుకూల వాతావరణంలో పకడ్బందీగా పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర రెవిన్యూ హౌసింగ్ పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు రీసర్వేలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని తొందరపాటుతో ఎలాంటి తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు బుధవారం హైదరాబాద్ నుంచి రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్ ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో భూముల రీసర్వే ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి సమీక్ష నిర్వహించారు జగిత్యాల జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ భూముల రీసర్వే ప్రక్రియపై ఇప్పటికే పలుమార్లు సమావేశాలు నిర్వహించామని ఉమ్మడి జిల్లాలలో క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ జిల్లా స్థాయి నుంచి మండల స్థాయి వరకు రెవెన్యూ అంశాలపై సమీక్షలు నిర్వహించామని తెలిపారు రీసర్వే ఫలితాలు క్షేత్రస్థాయిలో ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు గ్రౌండ్ రిపోర్టులను సేకరిస్తున్నామని పేర్కొన్నారు రీసర్వే సందర్భంగా ఎదురవుతున్న సమస్యలు లోపాలు వాటి పరిష్కార మార్గాలపై సమగ్రంగా చర్చిస్తున్నామని తెలిపారు రీసర్వే ఎస్‌ఓపీని పకడ్బందీగా అమలు చేయాలని భూముల రీసర్వేకు సంబంధించి రూపొందించిన ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్‌ఓపీ)ను అధికారులు పక్కాగా అమలు చేయాలని మంత్రి సూచించారు క్షేత్ర స్థాయి నివేదికల ఆధారంగా అవసరమైన మార్పులు సవరణలు చేపట్టాలని తెలిపారు కేవలం ఉన్నతాధికారులను సంతృప్తిపరిచే నివేదికలు కాకుండా క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించేలా నివేదికలు ఉండాలని స్పష్టం చేశారు నవంబర్ నెలాఖరులోగా ప్రతి జిల్లాలో తొలి విడతలో ఎంపిక చేసిన 70 గ్రామాలతో పాటు నక్షా లేని గ్రామాల్లో రీసర్వే ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు రీసర్వే పనుల్లో అధికారులు పూర్తి బాధ్యతతో చిత్తశుద్ధితో వ్యవహరించాలని సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు

అసైన్డ్ భూముల పట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి

అసైన్డ్ భూములకు సంబంధించి పట్టాలు అసలైనవా నకిలీవా అనే అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని మంత్రి సూచించారు.పట్టా పొందిన వ్యక్తులే ప్రస్తుతం ఆ భూములపై ఆధీనంలో ఉన్నారా లేదా అనే విషయాన్ని నిర్ధారించాలని తెలిపారు గతంలో ఒకరికి పట్టా ఇచ్చినప్పటికీ ప్రస్తుతం మరొకరు భూమిని అనుభవిస్తున్నట్లయితే ప్రస్తుత అనుభవదారుడు అర్హుడా కాదా అనే అంశాన్ని నిబంధనల ప్రకారం పరిశీలించాలని ఆదేశించారు.పట్టాలో పేర్కొన్న విస్తీర్ణానికి క్షేత్ర స్థాయిలో ఉన్న భూమి విస్తీర్ణానికి మధ్య తేడాలు ఉన్నాయా అనే విషయాన్ని కూడా క్షేత్ర స్థాయిలో సరి చూసుకోవాలని తెలిపారు సాగునీటి చెరువులు రహదారులు కుంటలు ఇతర అభివృద్ధి పనుల కోసం గతంలో భూసేకరణ చేసిన భూములకు సంబంధించిన సర్వే నంబర్లలో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు రీసర్వే ప్రక్రియలో ఎలాంటి సమస్యలు పెండింగ్‌లో ఉండకుండా అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించాలని సూచించారు రీసర్వేలో ఏ అధికారి అయినా అక్రమాలకు అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సస్పెన్షన్ తో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మంత్రి హెచ్చరించారు ప్రజలకు భవిష్యత్తులో ఎలాంటి భూ వివాదాలు తలెత్తకుండా రీసర్వే ప్రక్రియను నాణ్యతతో పారదర్శకంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు జగిత్యాల జిల్లాలో చేపట్టిన భూ సమగ్ర రీ సర్వే కార్యక్రమంలో ఇప్పటివరకు 18 గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినట్లు అధికారులు వివరించారు మిగిలిన గ్రామాల్లో కూడా రీ సర్వే పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని మంత్రి సూచించారు రీ సర్వే ప్రక్రియలో ఎలాంటి తప్పులు పొరపాట్లకు తావులేకుండా భూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు అదేవిధంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు అర్హులైన లబ్దిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునేలా అవసరమైన సహాయ సహకారాలు అందించాలని నిర్మాణాల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు క్షేత్ర స్థాయిలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించడంతో పాటు నిర్దేశించిన లక్ష్యాల మేరకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయ్యేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి స్పష్టం చేశారు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీఓలు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు జిల్లా అధికారులు పాల్గొన్నారు

ఇందిరమ్మ ఇంటికి గృహప్రవేశం

కోరుట్ల నవంబర్ 11 (వుదయం ప్రతినిధి)



మల్లాపూర్ మండలం వాల్గొండ గ్రామంలో గడ్డం లక్ష్మి శేఖర్ లకు ప్రభుత్వం ద్వారా మంజూరైన ప్రొసీడింగ్ పత్రం ద్వారా ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తి చేసుకొని బుధవారం చేపట్టిన ఇందిరమ్మ ఇంటికి గృహ ప్రవేశ వేడుకలకు ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు విచ్చేసి నూతన వస్త్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడు పేద మధ్యతరగతి ప్రజల అభివృద్ధి సంక్షేమం కోసమే కృషి చేస్తుందని అందులో భాగంగానే కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇల్లు లేని ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇంటి ప్రొసీడింగ్ పత్రాలు అందజేయడం జరిగిందని ఇంటి నిర్మాణాలు ఏ విధంగా జరిగితే ఆ విధంగా ఆ ఇంటి యజమాని ఖాతాలో డబ్బులు జమవుతాయన్నారు అలాగే నూతన రేషన్ కార్డులను మంజూరు చేయడమే కాకుండా రేషన్ దుకాణాల ద్వారా పేదలు కూడా కడుపునిండా తినాలనే సంకల్పంతో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సమయాన్ని పంపిణీ చేయడం జరుగుతుందన్నారు కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని తప్పకుండా నెరవేరుస్తుందన్నారు అనంతరం నూతన గృహ యజమానులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న తమ సొంత ఇంటి కల కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగారావు సహకారంతో తమ కళ సహకారమైందని తెలిపారు ఈ కార్యక్రమంలో వాల్గొండ తండా సర్పంచ్ సురేష్ ఉప సర్పంచ్ శ్రీనివాస్ వాల్గొండ సర్పంచ్ వసంత జిల్లా కిసాన్ కాంగ్రెస్ సెల్ అధ్యక్షులు జలపతి రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాట్ల సోమయ్య నాయకులు కిరణ్ జమాల్ రాజేందర్ రవి కిషన్ కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

ఒబులాపూర్ లో కేత్ బచావ్ అభియాన్

మల్యాల మండలం నవంబర్ 11 (వుదయం ప్రతినిధి)



మల్యాల మండలం ఓబులాపూర్ గ్రామంలో కేత్ బచావో అభియాన్, పంటలపై ఎల్ నినో ప్రభావం మరియు యాసంగిలో ఆరుతడి పంటలపై అవగాహన కార్యక్రమము మండల వ్యవసాయ అధికారి కే చంద్ర దీపక్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆదేశాలతో రైతులతో నిర్వహించారు.రైతులు వానకాలం పంటల కోతల అనంతరం పంట అవశేషములను కాల్చడం వల్ల నేల ఆరోగ్యం మరియు పర్యావరణ కాలుష్యం జరుగుతుందని కావున పంట అవశేషాలను భూమిలో కలిపి దున్నడం వల్ల భూసారం పెరుగుతుందని తెలిపారు.రైతులు ఎల్ నినో ప్రభావము ఎక్కువగా ఉండటంవల్ల పంటలను సంరక్షించుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాలని , రైతులు వరి పంట కోసిన తరువాత పంట కుంటలు వీబీజీ రామ్ జి పథకం క్రింద ఏర్పాటు చేసుకోవాలని కోరారు.ఎండాకాలం లో పశువుల కొరకు పశుగ్రాసం సాగు చేయాలని ముఖ్యంగా యాసంగిలో భూగర్భ జలాలు తక్కువగా ఉన్నందున వరికి బదులు ఆరుతడి పంటలు అయిన మొక్కజొన్న, పెసర, మినుములు, శనగలు,నూనె గింజ పంటలు అయిన ప్రొద్దు తిరుగుడు, వేరుశనగ వైపు మల్లాలని వెల్లడించారు.

రైతులు ఉద్యానవన శాఖ క్రింద తక్కువ నీటితో, తక్కువ రోజులు పంట అయిన కూరగాయలు పండించి ఆదాయం పొందాలని, మామిడి, ఆయిల్ పామ్ తోటలకు ఎండాకాలంలో డ్రిప్ ద్వారా నీటి తడులు ఇచ్చి కాపాడుకోవాలని , ఆయిల్ పామ్ సాగు చేపట్టి మంచి ఆదాయం పొందవచ్చని , రైతులు సోలార్ ఫెన్సింగ్ మరియు డ్రిప్ పరికరాల రాయితీ కొరకు ఉద్యానవన శాఖను సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుమార్, ఉప సర్పంచ్ మల్లేశం, RI తిరుపతి, Aeo శ్రీలేఖ, పంచాయతీ కార్యదర్శి కిరీటి మరియు తదితర రైతులు పాల్గొన్నారు.

కార్తీక మాస దిపోత్సవం

కోరుట్ల నవంబర్ 10 (వుదయం ప్రతినిధి)



కోరుట్ల పట్టణంలో గల అతిపురాతనమైన శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం కార్తికమాసాన్ని పురస్కరించుకుని ఆకాశ దీపోత్సవం కార్యక్రమం అత్యంత వైభవంగా ఆలయ అర్చకులు బీర్నంది నరసింహ చారి వైదిక నిర్వహణలో చేపట్టగా ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ధర్మపురి దేవస్థానం మాజీ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు విచ్చేసి స్వామివారిని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఎతిరాజం నర్సయ్య ధర్మకర్తలు నేతి శ్రీనివాస్ కటుకం దివాకర్ చిలువేరి విజయకుమార్ గొడికె రాములు చిట్యాల పద్మ ఆలయ ఈఓ యం విక్రమ్ జూనియర్ అసిస్టెంట్ పి నర్సయ్య భక్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ రాజబాబును దూషించిన వారిని ఎందుకు అరెస్ట్ చేయడం లేదు

మాల సంఘం రాష్ట్ర నాయకులు కొండ రవీందర్

మంథని, నవంబర్ 11:



పుట్టపాక సర్పంచ్ కన్నూరి రాజబాబును అసభ్య పదజాలంతో దూషించిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని, తిరుపతి రెడ్డిని ఎందుకు అరెస్టు చేయడం లేదో పోలీసులు సమాధానం చెప్పాలని మాల సంఘం రాష్ట్ర నాయకులు కొండ రవీందర్ తెలిపారు. బుధవారం మంథని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకుడు పోరెడ్డి తిరుపతి రెడ్డి, సర్పంచ్ రాజబాబును అవమానకరంగా మాట్లాడారని ఆయన ఆరోపించారు. ఇది హేయమైన చర్య అని అన్నారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన సర్పంచ్ రాజబాబును అవమానించిన తిరుపతి రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేయడమే కాకుండా, అరెస్ట్ చేసి చట్ట ప్రకారం ఎస్సి, ఎస్టీ యాక్ట్ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. తిరుపతి రెడ్డి అరెస్ట్ కాకపోవడం వెనుక ఏదైనా కుట్ర ఉందేమోనని అనుమానం వ్యక్తం చేశారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణకు మద్దతుగా ఉన్న సొంత పార్టీ నాయకులనే సస్పెండ్ చేయించిన తీరుగానే ఈ ఘటనలోనూ వ్యవహరిస్తున్నారని కొండ రవీందర్ విమర్శించారు. ఈ విలేకరుల సమావేశంలో మాల సంగం రాష్ట్ర నాయకులు కారెంగుల సుధాకర్, ఎరుకల రవి, పెద్దపల్లి జిల్లా నాయకులు కారెంగుల సురేష్, బడికెల సతీష్, జంజర్ల మురళి, బండారి సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

కోరుట్ల నవంబర్ 11 (వుదయం ప్రతినిధి)

స్వతంత్ర భారతదేశంలో విద్యాభివృద్ధికి విశేష కృషి చేసి గుణాత్మక విద్యకు పునాదులు వేసిన తొలి కేంద్ర విద్యా శాఖ మంత్రి భారతరత్న మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు అన్నారు బుధవారం కోరుట్ల పట్టణ 21వ వార్డులో మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు కృష్ణారావు విచ్చేసి స్థానిక వార్డు కౌన్సిలర్ సహనాజ్ సుల్తానా రీజ్వాన్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ జగిత్యాల జిల్లా మైనార్టీ అధ్యక్షులు ఎంఏ నయీం నాయకులు తెడ్డు విజయ్ రిజ్వాన్ పాషా పలువురు నాయకులు మైనార్టీ సోదరులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అజాం ఉపాధ్యాయులు యూసుఫ్ అధ్యాపక బృందం విద్యార్థులు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



ధర్మపురిలో వరి కొయ్యలు కాల్చొద్దు

యాసంగిలో ఆరుతడి పంటలే మేలు ఏఓ రాజ్‌కుమార్

ధర్మపురి,నవంబర్11(వు దయం ప్రతినిధి):

వ్యవసాయ రంగాన్ని పరి రక్షించడంతో పాటు పర్యావ రణాన్ని కాపాడుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎం.రాజ్‌కుమార్ పిలుపునిచ్చా రు.బుధవారం ధర్మపురి మండ లం అక్షాయిపల్లె గ్రామంలో వ్య వసాయ శాఖ ఆధ్వర్యంలో ఖేత్ బచావో అభియాన్ పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి కోతల తర్వా త రైతులు కొయ్యలను ఎట్టి పరి స్థితుల్లోనూ కాల్చవద్దని స్పష్టం చేశారు.కొయ్యలను కాల్చడం వల్ల నేలలోని సూక్ష్మజీవులు, మిత్రపురుగులు పూర్తిగా చని పోయి భూసారం దెబ్బతింటుం ది.మంటల వల్ల విద్యుత్ మో టార్లు,వైర్లు,పైపులైన్లు దగ్ధమై రైతులకు భారీ నష్టం వాటిల్లు తుంది.అంతేగాక మూగజీవా లకు ప్రాణాపాయం కలుగుతుం ది.వాతావర ణంలో తీవ్ర కాలు ష్యం ఏర్పడి ప్రజల ఆరోగ్యాలపై దుష్ప్రభావం పడుతుంది.కొయ్య లను కాల్చకుండా భూమి లోనే కలియదున్నాలి.కొయ్యలు త్వరగా మురగడానికి సింగిల్ సూపర్ ఫాస్పేట్ లేదా వేస్ట్ డికంపోజర్ వాడాలి. దీనివల్ల అవి సేంద్రీయ ఎరువుగా మారి భూసారం పెరుగుతుంది.ప్రస్తుత యాసంగి సీజన్‌లో ఎల్-నినో ప్ర భావం కారణంగా వర్షాలు తగ్గి, ప్రాజెక్టుల్లో నీటి మట్టాలు పడి పోయాయని,భూగర్భ జలా లు అడుగంటాయని ఏఓ తెలిపా రు. అందువల్ల రైతులు నీటి లభ్యత తక్కువగా ఉండే వరి సాగును తగ్గించి పెసర్లు,మిను ములు,సజ్జలు,జొన్నలు, చిరు ధాన్యాలు, కూరగాయలు,పొ ద్దు తిరుగుడు,వేరుశనగ,ను వ్వులు,కుసుమ వంటి ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేష్,ఏఈఓ నవ్య, గ్రామ రైతులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను ఇంటి పనులకు వినియోగించుకుంటున్న ఎమ్మెల్యే సంజయ్

- **మెట్పల్లి ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి**
- **కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మహమ్మద్ రైస్ డిమాండ్**

మెట్పల్లి నవంబర్ 11 (వుదయం విలేకరి)



మున్సిపల్ కార్మికులను వ్యక్తిగత ఇంటి పనులకు వినియోగించుకుంటూ వారికి మున్సిపాలిటీ నుంచి ప్రజాధనంతో జీతాలు చెల్లించడం ప్రజాధన దుర్వినియోగమేనని దీనిపై ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మెట్పల్లి పట్టణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మహమ్మద్ రైస్ డిమాండ్ చేశారు బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ తన నివాసంలో గత సుమారు రెండున్నర సంవత్సరాలుగా ఇద్దరు మున్సిపల్ కార్మికులను ఒకరిని వంట మనిషిగా మరొకరిని డ్రైవర్‌గా వ్యక్తిగత పనులకు వినియోగించుకున్నారని ఆరోపించారు అంతకుముందు ఆయన తండ్రి మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు హయాంలో కూడా సుమారు తొమ్మిది మంది మున్సిపల్ కార్మికులను దాదాపు పదేళ్లపాటు వివిధ వ్యక్తిగత పనులకు వినియోగించుకున్నారని ఆరోపించారు మున్సిపల్ కార్మికులకు చెల్లించే జీతాలు ప్రజలు కట్టే పన్నుల రూపంలో సమకూరే నిధుల నుంచే వస్తాయని, ప్రజల సొమ్మును వ్యక్తిగత ఇంటి పనులకు వినియోగించుకోవడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు ఎమ్మెల్యే ఇంట్లో పని చేసిన ఇద్దరు కార్మికులకు చెల్లించిన జీతాల మొత్తాన్ని పూర్తిగా లెక్కించి ఆ మొత్తాన్ని ఎమ్మెల్యే నుంచి రికవరీ చేయాలని పది రోజుల్లోగా ఆ మొత్తాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు కాంగ్రెస్ పార్టీ విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే నివాసంలో పని చేస్తున్న ఇద్దరు మున్సిపల్ కార్మికులను అక్కడి నుంచి తొలగించి తిరిగి మున్సిపల్ విధుల్లోకి పంపించిన మున్సిపల్ కమిషనర్‌కు కాంగ్రెస్ పార్టీ పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని రైస్ పేర్కొన్నారు అవినీతికి పాల్పడితే చెప్పుతో కొట్టాలని ఒక ఇంటర్వ్యూలో ఎమ్మెల్యే స్వయంగా వ్యాఖ్యానించారని గుర్తు చేస్తూ మరి ప్రజాధనాన్ని వ్యక్తిగత పనులకు వినియోగించిన అంశంపై ఎమ్మెల్యే ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు ఇది అవినీతి కాదా? ప్రజల సొమ్ముకు ఎవరు బాధ్యత వహిస్తారు? దీనిపై ఎమ్మెల్యే ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు అదే విధంగా మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు రాజకీయాల్లోకి రాకముందు ఆయన కుటుంబ ఆస్తులు ఎంత ఉన్నాయి? ప్రస్తుతం ఉన్న ఆస్తులు ఎంత? అనే అంశంపై బహిరంగ చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు ఆయన ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో నిర్మించిన భవనాలు కమర్షియల్ భవనాలు హైదరాబాద్‌లోని విల్లాలు ప్లాట్లు తదితర ఆస్తుల గురించి ప్రజల్లో అనేక చర్చలు జరుగుతున్నాయని పేర్కొన్నారు ఈ ఆస్తుల వివరాలు వాటి ఆదాయ వనరులపై ఎమ్మెల్యే సంజయ్ ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు

పది రోజుల్లోగా ప్రజాధనం రికవరీ చేయాలి

మున్సిపల్ కార్మికులకు వ్యక్తిగత పనుల కోసం చెల్లించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న జీతాల మొత్తాన్ని పది రోజుల్లోగా రికవరీ చేయాలని అలాగే మెట్పల్లి ప్రజలకు ఎమ్మెల్యే బహిరంగ క్షమాపణ చెప్పాలని మహమ్మద్ రైస్ డిమాండ్ చేశారు లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నివాసాన్ని ముట్టడించి నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్ కౌన్సిలర్లు బత్తుల నరేష్ మాసర ప్రవీణ్ అజీమ్ అజయ్ నరేష్ మహేష్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలు



కోరుట్ల నవంబర్ 11 (వుదయం ప్రతినిధి)

కోరుట్ల మున్సిపల్ కమీషనర్ వి రాఘవేంద్ర ఆదేశాల మేరకు కోరుట్ల పట్టణంలోని పలు కిరాణా సూపర్ మార్కెట్ లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వారు వినియోగిస్తున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ స్వాధీన పరుచుకొని చెత్త బయట పడేసిన ఇంటి యజమానిపై 9 వేల 500 రూపాయలు జరిమానాలు విధించడంతో పాటు అవగాహన కల్పించారు అలాగే ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చెయ్యని దుకాణా దారులకు ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలని తెలిపారు ఈ సందర్భంగా మున్సిపల్ కమీషనర్ రాఘవేంద్ర మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను పూర్తి స్థాయిలో నిషేధించాలని లేని యెడల భారీ జరిమానాలు విధించడంతో పాటు దుకాణాలు సీజ్ చేయడం జరుగుతుందని ట్రేడ్ లైసెన్స్ లేని వారు వెంటనే తీసుకోవాలని తెలిపారు వ్యాపార కార్యకలాపాలతో వెలువడిన చెత్తను తడి పొడి హానికరక చెత్తగా వేరు చేసి షాప్ వద్దకు వచ్చే మున్సిపల్ వాహనాలకు అందించాలని తెలిపారు లేనిచో ఎస్డబ్ల్యూఎం-2026 చట్టం ప్రకారం జరిమానా విధించబడునన్నారు ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ అశోక్ జవాన్లు నవీన్ చంద్ర ప్రకాష్ జగ్గల్ల రమేష్ రాజు పాల్గొన్నారు.

తల్లి దండ్రులను పోషించని కొడుకు

జగిత్యాల నవంబర్ 11 (వుదయం ప్రతినిధి)



జగిత్యాల జిల్లా మల్యాల మండలం రాజారం గ్రామానికి చెందిన భూర్గుపెల్లి సింగరయ్య (75) రత్నమ్మ (72) అనే అనారోగ్యంతో వృద్ధ తల్లిదండ్రులకు కొడుకు ఆంజనేయులు పోషణ వైద్య ఖర్చులు పెట్టాలని అడుగుతుంటే కొడుతున్నాడని జిల్లా కేంద్రంలోని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ను ఆశ్రయించారు కాగా బుధవారం సీనియర్ సిటిజన్స్ ప్రతినిధులతో వెళ్లి ఆర్డీవో కు ఫిర్యాదు చేయగా వయోవృద్ధుల సంరక్షణ పోషణ చట్టం సెక్షన్ 24 సెక్షన్ 2(బి) కింద కొడుకుపై కేసు నమోదు చేశారు అనంతరం సీనియర్ సిటిజన్స్ జిల్లా కార్యాలయంలో ఆ తండ్రి తన గోడును విలేకరులకు వివరించారు వృద్ధ తల్లి దండ్రులమైన మేము అనారోగ్యంతో బాధ పడుతున్న పరిస్థితుల్లో తమ కొడుకు ఆంజనేయులును తమకు పోషణ వైద్య ఖర్చులు పెట్టమని బ్రతిమిలాడితే కనికరం లేకుండా కొడుతున్నాడని గ్రామ పెద్ద మనుషులకు చెప్పుకుంటే ప్రతి నెలా పోషణ.వైద్య ఖర్చులు ఇస్తానని ఒప్పుకున్నా కూడా పాటించకపోవడంతో పోషణ వైద్యం కోసం పలు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు తమ పోషణ వైద్య ఖర్చుల కోసం తమ కొడుకు ఆంజనేయులు నుంచి ప్రతి నెలా 10 వేల రూపాయలు ఇప్పించాలని సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు న్యాయవాది హరి అశోక్ కుమార్ సాయంతో ఆర్డీవో కు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారని ఎస్పీ కి సైతం ఫిర్యాదు చేస్తామన్నారు ఆ వృద్ధుల వెంట సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ చట్టం కాన్సిలియేషన్ అధికారులు పి హన్మంత్ రెడ్డి వెల్మల ప్రకాష్ రావు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట

- అభివృద్ధి సంక్షేమమే ప్రభుత్వానికి రెండు కళ్లు
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

కోరుట్ల నవంబర్ 11 (వుదయం ప్రతినిధి)

వేములవాడ నియోజకవర్గ పరిధిలోని కథలాపూర్ రుద్రంగి కోనరావుపేట మండలం గిరిజన తండాలకు మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 19 కోట్లకు పైగా నిధులు మంజూరు చేసిందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమారొ లిపారు ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తో కలిసి కథలాపూర్ మండలంలో మొత్తం 13.10 కోట్లతో చేపట్టనున్న పలు బీటీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా భూషణ్ రావుపేట మెయిన్ రోడ్డు నుంచి కోనాపూర్ వాసం గుట్ట తండా వరకు 1.20 కోట్లతో భూషణ్ రావుపేట కండ్ల బాట నుంచి రాజారాం తండా వరకు 3.60 కోట్లతో ఇప్పపల్లి గ్రామం నుంచి తండా వరకు 3 కోట్లతో కలికోట మెయిన్ రోడ్డు నుంచి పోతారం లొంక రామన్న తండా వరకు 5.30 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ మాట్లాడుతూ గిరిజన తండాలు గూడాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోందని తెలిపారు గిరిజన ప్రాంతాల్లో రోడ్లు తాగునీరు ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖల ద్వారా ప్రత్యేక నిధులు సమకూర్చేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఆర్టికల్ 275(1) కింద గిరిజన ప్రాంతాలకు అదనపు ని ధులు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నామని వెల్లడించారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని పేదల సంక్షేమం గిరిజన ప్రాంతాల అభివృద్ధి విద్య వైద్యం రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని వివరించారు గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులకు మంత్రి కీలక సూచనలు చేశారు ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయిన పనులను వెంటనే ప్రారంభించి నిర్ణీత షెడ్యూల్ ప్రకారం నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని ఆదేశించారు అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు .

ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కథలాపూర్ మండలంలోని భూషణరావుపేట మేజర్ నుంచి వాసంత గుట్ట తండా వరకు, భూషణ రావుపేట కండ్లబాట నుంచి చింతకుంట మీదుగా రాజారాం తండా వరకు ఇప్పపల్లి నుంచి ఇప్పపల్లి తండా వరకు కలిగోట నుంచి పోతారం తండా వరకు రుద్రంగి మండలంలోని కుక్కల గండి తండా దశరథ నాయక్ తండా వద్ద బ్రిడ్జి నిర్మాణం కోనరావుపేట మండలంలోని బూక్యారెడ్డి తండా నుంచి హనుమాన్ తండా వరకు రహదారులు, బ్రిడ్జిల నిర్మాణ పనులకు నిధులు మంజూరయ్యాయని వివరించారు ఇప్పటికే టెండర్లు పూర్తయ్యాయని, పనులకు భూమిపూజ చేయడం సంతోషకరమన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావిస్తూ అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి సమాంతరంగా కృషి చేస్తోందని పేర్కొన్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోజుకు 18 గంటల పాటు శ్రమిస్తూ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి.అన్ని వర్గాల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు గత ప్రభుత్వం రాష్ట్రాన్ని భారీ అప్పుల్లోకి నెట్టినప్పటికీ ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తోందన్నారు ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే ఐదు గ్యారెంటీలను అమలు చేశామని పెన్షన్లకు సంబంధించి కూడా ఈ వారంలో కీలక నిర్ణయం అమలు చేయనున్నట్లు తెలిపారు ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి.సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు గమనిస్తున్నారని అయినప్పటికీ ప్రతిపక్ష నేతలు హరీశ్ రావు కేటీఆర్ ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తూ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు గత పదేళ్ల పాలనలో జరిగిన అవినీతి అక్రమాలు విధ్వంసకర పాలనతో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన వారు నేడు ప్రజా ప్రభుత్వాన్ని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు కథలాపూర్ మేడిపల్లి భీమారం మండలాల రైతులకు వరప్రదాయినిగా నిలిచే



కలిగోట సూరమ్మ ప్రాజెక్టు పనులను కూడా ప్రజా ప్రభుత్వం వేగవంతం చేసిందని ఆది శ్రీనివాస్ తెలిపారు ప్రాజెక్టు భూసేకరణ కోసం 80 కోట్ల రూపాయలకు పైగా నిధులు కేటాయించడంతో పాటు ఇప్పటికే 75 శాతం పనులు పూర్తయ్యాయని చెప్పారు రాబోయే రోజుల్లో ఈ మూడు మండలాల్లో భూగర్భ జలాలు పెంపొందించేలా కుడి ఎడమ కాలువల నిర్మాణ పనులను కూడా చేపడతామని వెల్లడించారు .గిరిజన తండాల అభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు నియోజకవర్గ ప్రజలు గిరిజనుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు

మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్



జయంతి వేడుకలకు హాజరైన జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్ ప్రసూనాంబ

జగిత్యాల నవంబర్ 11 (వుదయం ప్రతినిధి)

స్వతంత్ర భారతదేశంలో విద్యాభివృద్ధికి విశేష కృషి చేసి గుణాత్మక విద్యకు పునాదులు వేసిన తొలి కేంద్ర విద్యాశాఖ మంత్రి భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయమని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్ ప్రసూనాంబ పేర్కొన్నారు బుధవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్లో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్ ప్రసూనాంబ మాట్లాడుతూ జన్మదినమైన నవంబర్ 11న దేశవ్యాప్తంగా జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహిస్తారని అన్నారు స్వాతంత్ర్యం అనంతరం తొలి కేంద్ర ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆజాద్ సుమారు 11 సంవత్సరాల పాటు దేశ విద్యారంగ అభివృద్ధికి కృషి చేశారు సమగ్ర విద్యావిధాన రూపకల్పనకు పునాదులు వేయడంతో పాటు ప్రాథమిక ఉన్నత సెకండరీ విద్యాభివృద్ధికి ప్రత్యేక కమిషన్లను ఏర్పాటు చేశారు విద్యా రంగంలో ఉన్నత ప్రమాణాల సాధనకు యూజీసీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల ఏర్పాటుకు కృషి చేసి సాంకేతిక విద్యాభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చారు భారతీయ సంస్కృతి కళలు సంగీతం సాహిత్య పరిరక్షణకు విశేష సేవలందించారు విద్య ద్వారానే వ్యక్తి సమాజం దేశం అభివృద్ధి చెందుతాయని చాటిచెప్పిన ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని నాణ్యమైన విద్యను అందరికీ చేరువ చేయాలని ఈ సందర్భంగా స్మరించుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ మరియు జిల్లా రెవెన్యూ అధికారి కె వై ప్రసాద్ జిల్లా అధికారులు కలెక్టరేట్ ఏవో కిషన్ కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ వెలుగులు

- రూ.కోటితో 20 పాఠశాలల్లో స్మార్ట్ తరగతి గదులు
- కలెక్టర్ గరిమ అగ్రవాల్ చేతుల మీదుగా పెద్దూరులో ప్రారంభం

రాజన్న సిరిసిల్ల, నవంబర్11 (వుదయం ప్రతినిధి) :



విద్యార్థుల జీవితాల్లో ఉన్నతమైన మార్పునకు చదువే పునాది అని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా అభ్యసిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని సూచించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి, జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూరు ఎంపీహెచ్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన స్మార్ట్ తరగతి గదిని కలెక్టర్ ప్రారంభించారు.

20 పాఠశాలల్లో స్మార్ట్ తరగతి గదులు

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్) నిధులతో జిల్లాలోని 20 ప్రభుత్వ పాఠశాలల్లో రూ.కోటి వ్యయంతో స్మార్ట్ తరగతి గదులను ఏర్పాటు చేశారు. ఒక్కో పాఠశాలలో తరగతి గదికి రంగులు వేయడంతోపాటు నాలుగు ఫ్యాన్లు, లైట్లు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్, 10 డెస్కులు, యూపీఎస్ సదుపాయాలను కల్పించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రాజీవ్‌నగర్ ఎంపీహెచ్‌ఎస్, తారక రామనగర్ ఎంపీపీఎస్, తంగళ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల, ఎంపీపీఎస్, ఆర్టీసీ కాలనీ ఎంపీపీఎస్, బద్దెనపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల, ఇల్లంతకుంట జడ్పీ ఉన్నత పాఠశాల, గంభీరావుపేట మండలం లింగన్నపేట జడ్పీ ఉన్నత పాఠశాల, మల్లారెడ్డిపేట ఎంపీపీఎస్, ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల, బొప్పాపూర్, దుమాల ఎంపీపీఎస్, చందుర్తి మండలం మల్యాల జడ్పీ ఉన్నత పాఠశాల, సనుగుల ఎంపీపీఎస్, వేములవాడ మండలం రుద్రవరం జడ్పీ ఉన్నత పాఠశాల, వేములవాడ పట్టణ ఎంపీపీఎస్, వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి ఎంపీపీఎస్, కోనరావుపేట మండలం నిజామాబాద్ ఎంపీపీఎస్, రుద్రంగి ఎంపీపీఎస్‌లలో ఈ సదుపాయాలు కల్పించారు.

కలెక్టర్ చొరవతో ప్రభుత్వ పాఠశాలలకు కొత్త హంగులు

జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో ప్రభుత్వ విద్యాసంస్థలు, ఆసుపత్రుల్లో సీఎస్‌ఆర్ నిధుల ద్వారా మౌలిక సదుపాయాలు మెరుగుపడుతున్నాయి. సిరిసిల్ల, వేములవాడ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో యూనియన్ బ్యాంకు సహకారంతో రూ.22 లక్షల వ్యయంతో 145 పడకలు, పరుపులు ఏర్పాటు చేశారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఆధ్వర్యంలో రూ.కోటితో 20 పాఠశాలల్లో స్మార్ట్ తరగతి గదులు అందుబాటులోకి తెచ్చారు. త్వరలోనే జిల్లాలోని పలు ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ సీఎస్‌ఆర్ నిధులతో సదుపాయాల కల్పన పనులు చేపట్టనున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యక్తి వికాసానికి, సమాజ అభివృద్ధికి విద్య శక్తిమంతమైన ఆయుధమని పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మౌలానా అబుల్ కలాం ఆజాద్, ఏపీజే అబ్దుల్ కలాం వంటి మహనీయులు ఎన్నో కష్టాలను అధిగమించి ఉన్నత విద్యను అభ్యసించి దేశానికి విశేష సేవలందించారని గుర్తు చేశారు. ఇన్ఫోసిస్ ఛైర్మన్ నారాయణ మూర్తి సతీమణి సుధామూర్తి విద్యాభ్యాసం కూడా విద్యార్థులకు స్ఫూర్తిదాయకమన్నారు.వారి జీవితాల్లోని ఉన్నత విలువలు, సాధించిన విజయాలు, సమాజానికి చేసిన సేవలను ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. పుట్టిన ప్రాంతం, మాట్లాడే భాష, కుటుంబ నేపథ్యం, ఆర్థిక పరిస్థితులు ఉన్నత విద్యాభ్యాసానికి అడ్డంకులు కావని స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థి అన్ని పాఠ్యాంశాలపై పట్టు సాధించి, ఉన్నత ఉద్యోగాలు పొందడంతోపాటు స్వయం ఉపాధి రంగాల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ద్వారానే సమాజంలో సానుకూల మార్పు సాధ్యమని అన్నారు,ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి విజయ్ సాగర్, తహసీల్దార్ మహేశ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజీవ్ కుమార్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రతినిధులు శ్రావణ్ కుమార్, నాగేశ్వరరావు, కమలాకర్, మండల విద్యాధికారి దూస రఘుపతి, కాంప్లెక్స్ హెచ్‌ఎం మోతిలాల్, ఏపీసీ ఛైర్‌పర్సన్ తిప్పవరం సుధ, హెచ్‌ఎం చక్రవర్తుల రమాదేవి, వార్డు కౌన్సిలర్లు లింగంపల్లి భాగ్యలక్ష్మి , దొంతినేని కళ్యాణి పాల్గొన్నారు.

కేశన్‌పల్లి యువ రైతు సాగుకు స్వీడన్ జర్నలిస్ట్ ఫిదా!

- రసాయన ఎరువులకు దూరంగా.. సేంద్రియ సాగుతో సిరులు
- బయో ఎరువుల తయారీ, పంటల సాగు విధానంపై రాజేందర్‌తో ప్రత్యేక ఇంటర్వ్యూ

ముత్తారం నవంబర్ 11(వుదయం ప్రతినిధి):



సాధారణంగా రైతులు రసాయన ఎరువులపై ఆధారపడుతుంటే.. అందుకు భిన్నంగా ప్రకృతి వ్యవసాయాన్ని నమ్ముకుని సేంద్రియ సాగుతో పంటలు పండిస్తున్న కేశన్‌పల్లి యువ రైతు రాజేందర్ కృషి అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించింది.స్వీడన్ దేశానికి చెందిన జర్నలిస్ట్ బుధవారం ముత్తారం మండలం కేశన్‌పల్లి గ్రామానికి చేరుకుని రాజేందర్‌ను ప్రత్యేకంగా ఇంటర్వ్యూ చేశారు.రాజన్న బయో రీసెర్చ్ సెంటర్ ద్వారా రసాయన ఎరువులు వినియోగించకుండా పంటలు సాగు చేస్తున్న విధానాన్ని రాజేందర్ వివరించారు.పత్తితో పాటు ఇతర పంటలు, అంతర పంటలుగా పెసర,కంది సాగు చేస్తున్న తీరును తెలియజేశారు. పాడి పశువుల ఎరువులతో బయో కెమికల్స్ తయారు చేసి పంటలకు వినియోగిస్తున్న విధానాన్ని వివరించారు.రసాయన ఎరువుల అధిక వినియోగంతో నేల సారవంతం తగ్గడంతో పాటు ప్రజల ఆరోగ్యంపై పడే ప్రభావాలను కూడా జర్నలిస్ట్‌కు వివరించారు.భవిష్యత్తులో మరింత మంది రైతులను సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లించి, బయో ఎరువుల వినియోగాన్ని విస్తరించేందుకు కృషి చేస్తానని రాజేందర్ తెలిపారు. ఓ మారుమూల గ్రామానికి చెందిన యువ రైతు అనుసరిస్తున్న సాగు విధానాలను తెలుసుకునేందుకు విదేశీ జర్నలిస్ట్ రావడం గ్రామస్థుల్లో ఆసక్తి రేకెత్తించింది. స్థానిక రైతు ఆలోచనలు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

పారిశుధ్యంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు



- పట్టణ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి
- మున్సిపల్ అధికారులకు చైర్మన్ పుల్కం రాజు

వేములవాడ, నవంబర్ 11 (వుదయం ప్రతినిధి) :

పట్టణాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దేందుకు పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అధికారులకు సూచించారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ లోకేష్ ఆధ్వర్యంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు అధికారులు, మున్సిపల్ జవాన్లతో పట్టణ పారిశుధ్య నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పుల్కం రాజు మాట్లాడుతూ ప్రతి వార్డులో ప్రతిరోజూ చెత్త సేకరణ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. రహదారులు, మురికి కాలువలు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త పేరుకుపోకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పారిశుధ్య కార్మికులు విధుల పట్ల బాధ్యతగా వ్యవహరిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, పారిశుధ్య సమస్యలు గుర్తించిన వెంటనే పరిష్కరించాలని సూచించారు. తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా విభజించి మున్సిపల్ స్వచ్ఛ ఆటోలకు అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పట్టణ పరిశుభ్రత మున్సిపల్ సిబ్బంది బాధ్యత మాత్రమే కాదని, ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు, సిబ్బంది నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుకుమార్, మున్సిపల్ జవాన్లు తదితరులు పాల్గొన్నారు.



నీటి సంరక్షణతోనే సుస్థిర వ్యవసాయం!

మైదంబండలో 'ఖేతీ బచావో అభియాన్'.. రైతులకు వ్యవసాయ శాఖ అధికారుల అవగాహన

ముత్తారం నవంబర్ 11(వుదయం ప్రతినిధి):

భవిష్యత్తులో సాగునీటి ఎద్దడి తలెత్తకుండా రైతులు ఇప్పటి నుంచే నీటి సంరక్షణపై దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి జె. అనూష సూచించారు. ముత్తారం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మైదంబండ గ్రామంలో 'ఖేతీ బచావో అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా అనూష మాట్లాడుతూ.. బిందు, తుంపర సేద్య పద్ధతులను అవలంబిస్తూ తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకోవాలని సూచించారు.సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని,ఒంగోలు,గిర్, సహివాల్ వంటి దేశవాళీ పశుజాతుల పెంపకంతో పాల దిగుబడిని పెంచుకోవచ్చన్నారు. పశువుల పేడను సేంద్రియ ఎరువుగా వినియోగించుకోవాలని తెలిపారు.వరి కోతల అనంతరం పంట గడ్డిని కాల్చకుండా గడ్డి చుట్టలుగా తయారుచేసి నిల్వ చేసుకోవాలని,తద్వారా పశుగ్రాస కొరతను అధిగమించవచ్చన్నారు. ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు అడుగంటకుండా ప్రతి గ్రామంలో ఇంకుడు గుంతలు నిర్మించి వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు బియ్యని శివకుమార్, ఏఈఓ బి. శశిధర్, రైతులు, మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు.



మాన్యశ్రీ కె.వి. నారాయణరెడ్డి సేవలు చిరస్మరణీయం

జమ్మికుంట, నవంబర్ 11, 2026 (వుదయం ప్రతినిధి):

కీ.శే. మాన్యశ్రీ కె.వి. నారాయణ రెడ్డి సేవలు చిరస్మరణీయమని కరీంనగర్ జిల్లా జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షులు ప్రొఫెసర్ నన్న రామస్వామి అన్నారు. జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం కళాశాల వ్యవస్థాపకులు కీ.శే. మాన్యశ్రీ కె.వి. నారాయణ రెడ్డి విగ్రహాన్ని పూర్వ విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షులు చేతుల మీదగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలనే ఒక గొప్ప లక్ష్యంతో 1965 సంవత్సరంలో మాన్యశ్రీ నారాయణ రెడ్డి గారు జమ్మికుంటలో ఆదర్శ కళాశాల పేరు మీదగా కళాశాలను స్థాపించారన్నారు. జమ్మికుంటలో కళాశాలను ఏర్పాటు చేయడం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వరంగా మారిందన్నారు. నాటి నుండి నేటి వరకు వేలల్లో విద్యార్థులు చదువుకొని ఉన్నతస్థాయికి ఎదిగారన్నారు. అలాంటి గొప్ప నాయకుడు ఈ కళాశాలను స్థాపించడం ఈ ప్రాంత విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి. రమేష్ , పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు మీర్ అహ్మద్ హుస్సేన్, మొలుగూరి సదయ్య, మైస మహేందర్, అన్వర్ బాబు, డా. కె. రాజేంద్రం, బచ్చు భాస్కర్, శివకుమార్, ఆకుల రాజేందర్, టి. రాజ్ కుమార్, జగదీశ్వర్, సయ్యద్ సజ్జు, ప్రసాద్, సుధాకర్, సాయికుమార్, అరుణ్ రాజ్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



బ్యాచిలర్ ఆఫ్ ఫార్మసీలో గోల్డ్ మెడల్ సాధించిన మెట్ పల్లి విద్యార్థి

మెట్ పల్లి నవంబర్ 11 (వుదయం ప్రతినిధి)

మెట్ పల్లి పట్టణానికి చెందిన మహ్మద్ ఇమ్రాన్ బ్యాచిలర్ ఆఫ్ ఫార్మసీ (బీఫార్మసీ)లో ప్రథమ శ్రేణితో ఉత్తీర్ణత సాధించి యూనివర్సిటీ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించాడు మెట్ పల్లి పట్టణానికి చెందిన మహ్మద్ ఇమ్రాన్ హైదరాబాద్ జేయన్టీయూ సాంకేతిక విశ్వవిద్యాలయం ఇటీవల నిర్వహించిన పరీక్ష లో ఉత్తీర్ణత సాధించి గోల్డ్ మెడల్ సొంతం చేసుకున్నాడు మహ్మద్ ఇమ్రాన్ యూనివర్సిటీ చివరి ఫలితాలలో గోల్డెమెడల్ సాధించడం పట్ల మెట్ పల్లి కి చెందిన విద్యావంతులు మేధావులు హర్షం వ్యక్తం చేసి ఇమ్రాన్‌కు శుభాకాంక్షలు తెలిపారు ఉత్తమ ప్రతిభ కనబరిచి తదుపరి ఉన్నత విద్య కోసం ఫార్మ్ డీ లో ఉచిత సీటు పొందాడు ఫార్మాసి విద్యలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి భవిష్యత్తులో సమాజానికి సేవ చేయాలని ఈ సందర్భంగా పట్టణ ప్రముఖులు ఆకాంక్షించారు.

బియ్యం బ్లాక్ మార్కెట్ ను అధికారులు అరికట్టాలి

- బియ్యం ధరల కృత్రిమ పెంపు పై ప్రభుత్వం పలు ఆంక్షలు విధించింది
- ఒక్క గుంట ఎండిపోకుండా రైతులకు కరెంట్ సాగు నీరు అందించాం
- చలిగల్ వ్యవసాయ మార్కెట్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

జగిత్యాల నవంబర్ 11 (వుదయం ప్రతినిధి)



జగిత్యాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం జగిత్యాల ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ చలిగల్ లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా సజావుగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు లక్ష ఎస్ ఎఫ్ టి తో 8కోట్ల తో షెడ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందని 1కోటి 80లక్షల తో సీసీ రోడ్డు పనులు చేయటం జరిగిందన్నారు. ఎల్ నీ నో ప్రభావం వల్ల రైతులు ఆరుతడి పంటలు పండించే ఆలోచన చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్ ప్రసూనాంబ పీఏసీఎస్ చైర్మన్ కొలుగూరి దామోదర్ రావు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గాజంగి నందయ్య మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి డీసీఓ మనోజ్ డిసిఎస్ఓ జితేందర్ రెడ్డి తహసీల్దార్ హకీం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అబ్బూరి మల్లేశం గౌడ్ మాజీ జెడ్పీటీసీ పెండెం రాములు బాల ముకుందం సమిండ్ల శ్రీనివాస్ జిల్లా మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు బొలిశెట్టి గంగారెడ్డి కట్ట రాజేందర్ సర్పంచులు జున్ను రాజేందర్ రాజేందర్ మల్లారెడ్డి మల్లేష్ ఏఓ తిరుపతి నాయక్ సిఈఓ వేణు పీఏసీఎస్ డైరెక్టర్లు పురుషోత్తం రావు గంగారం నీరటి గంగారెడ్డి మార్కెట్ కమిటీ డైరెక్టర్ గడ్డం గంగారెడ్డి అసెంబ్లీ యూత్ అధ్యక్షులు భూమారెడ్డి నాయకులు రమణ రావు పులిశెట్టి శ్రీనివాస్ అంకం సతీష్ నలువాల సురేష్ దాసరి సతీష్ నరేష్ పూర్ణ చందర్ వెంకటేష్ నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యానికి గ్రామస్థులే బలి కావాలా?

- శాలగుళ్లపల్లిలో విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు
- సర్పంచ్ ఫిర్యాదు చేసినా స్పందించని అధికారులు
- ప్రమాదం పొంచి ఉందని గ్రామస్థుల ఆందోళన!

ముత్తారం నవంబర్ 11(వుదయంప్రతినిధి):



విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తగులుతున్నా..అధికారులకు మాత్రం చలనం కరువైంది.ఏ క్షణంలో ప్రమాదం ముంచుకొస్తుందోనన్న భయంతో శాలగుళ్లపల్లి గ్రామస్థులు బిక్కుబిక్కుమంటున్నారు.తరచూ విద్యుత్ అంతరాయంతో ఇబ్బందులు పడుతున్నా..సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ముత్తారం మండలం పారుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని శాలగుళ్లపల్లిలో విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు అడ్డుగా ఉండటంతో సరఫరాకు అంతరాయం కలుగుతోంది.ఈ సమస్యను స్థానిక సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లగా,ఆయన మండల స్థాయి విద్యుత్ అధికారులకు సమాచారం అందించినట్లు గ్రామస్థులు చెబుతున్నారు.అయినా ఇప్పటివరకు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కరించిన దాఖలాలు లేవని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?

విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తగలడం వల్ల షార్ట్‌సర్క్యూట్ జరిగే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.ప్రజల ప్రాణ భద్రతకు సంబంధించిన సమస్యపై అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు.విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగినప్పుడే స్పందిస్తారా? ప్రమాదం జరిగిన తర్వాతే చర్యలు తీసుకుంటారా? అంటూ నిలదీస్తున్నారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి శాలగుళ్లపల్లిలో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాలని,విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి,ప్రమాదకరంగా ఉన్న లైన్లను సరిచేయాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.నిర్లక్ష్యం కొనసాగితే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

వేధింపులపై మౌనం వద్దు.. ధైర్యంగా ఫిర్యాదు చేయండి

షీ టీమ్స్, ఏహెచ్‌టీయూ ఆధ్వర్యంలో కార్యక్రమం

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 11 (వుదయం ప్రతినిధి) :



మహిళల భద్రత, బాల్య వివాహాలు, సైబర్ నేరాలు, ర్యాగింగ్‌పై విద్యార్థినులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా షీ టీమ్స్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (AHTU) ఆధ్వర్యంలో విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం సిరిసిల్ల పట్టణంలోని సహస్ర జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు మహిళల భద్రత, ఈవ్‌టీజింగ్, సోషల్ మీడియా వేధింపులు, ర్యాగింగ్, మానవ అక్రమ రవాణా, పోక్సో చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటి వల్ల బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తు దెబ్బతింటాయని వివరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు లేదా మానవ అక్రమ రవాణా సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్లు, బహిరంగ ప్రదేశాల్లో మహిళలు, బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, వేధింపులకు పాల్పడినా, ర్యాగింగ్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేధింపులకు గురైన విద్యార్థినులు భయపడకుండా ధైర్యంగా షీ టీమ్స్‌ను ఆశ్రయించాలని, ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచి అవసరమైన రక్షణ, సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు.సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకులు, సోషల్ మీడియా పరిచయాలను నమ్మవద్దని సూచించారు. వ్యక్తిగత వివరాలు, ఓటీపీలు, బ్యాంకు ఖాతాల సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు.ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఏఎస్ఐ ప్రమీల, షీ టీమ్, ఏహెచ్‌టీయూ సిబ్బంది పాల్గొన్నారు.

కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామివారి చందనోత్సవం, మహా సంప్రోక్షణ కార్యక్రమాలకు సీఎం రేవంత్ రెడ్డి కి ఆహ్వానం

మల్యాల మండలం నవంబర్ 11 (వుదయం ప్రతినిధి)



కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో ఈ నెల 15వ తేదీ నుండి 20వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్న శ్రీ స్వామివారి చందనోత్సవం మరియు మహా సంప్రోక్షణ కార్యక్రమాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి , రాష్ట్ర మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి కి చొప్పదండి MLA మేడిపల్లి సత్యం ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి అంజనా రెడ్డి , ఆలయ ప్రధాన అర్చకులు చిరంజీవి స్వామి, స్థానాచార్యులు కపీందర్, ఉప ప్రధాన అర్చకులు లక్ష్మణ ప్రాణదాత ప్రసాద్, సునీల్ కుమార్ సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి మాదిగలకే కేటాయించాలి



- మాదిగలకు పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్
- మాదిగలు కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు
- మాదిగ కార్యకర్తల సేవలను గుర్తించాలని నాయకుల విజ్ఞప్తి

భూపాలపల్లినవంబర్ 11 వుదయం ప్రతినిధి.

భూపాలపల్లి జిల్లా చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి మాదిగలకు కేటాయించాలని నేతలు కోరారు. ఈ విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని అన్నారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా నాయకులు రామ్ రామ్ చందర్ మాదిగ కోరారు. టేకుమట్ల మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మచ్చ శ్రీకాంత్ మాదిగ కూడా ఈ డిమాండ్ చేశారు. చిట్యాల పరిధిలో ఈ పదవి కోసం మాదిగలను పరిగణించాలని కోరారు. చిట్యాల, మొగుళ్లపల్లి, టేకుమట్ల మండలాల్లో మాదిగల జనాభా గణనీయంగా ఉందని నేతలు తెలిపారు. జనాభా ప్రాతిపదికన పదవి కేటాయించాలని డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలను దృష్టిలో ఉంచాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి మాదిగలు కష్టపడ్డారని నాయకులు చెప్పారు. పార్టీ జెండాలు కట్టడం, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం వంటి పనులు చేశారు. ఎన్నికల ప్రచారంలోనూ మాదిగలు పాల్గొన్నారని తెలిపారు. క్షేత్రస్థాయిలో మాదిగ కార్యకర్తల సేవలు పార్టీ విజయానికి దోహదపడ్డాయని నేతలు అన్నారు.

వారి సేవలను మరువలేనివిగా పేర్కొన్నారు. ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేసిన సామాజిక వర్గాలకు పదవుల్లో గుర్తింపు ఇవ్వాలని నాయకులు కోరారు. తగిన ప్రాధాన్యత కల్పించడం ప్రభుత్వ బాధ్యతన్నారు. మాదిగల జనాభా, రాజకీయ సేవలను ప్రభుత్వం పరిగణించాలని నేతలు కోరారు. చైర్మన్ పదవిలో మాదిగలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నేతకాని కులస్తులకు ఎస్సీ రిజర్వేషన్లలో పూర్తి న్యాయం చేయాలి

- మహాసభ ఈ నెల 15న జరగనుంది



మహాదేవపూర్, నవంబర్ 11 (వుదయం ప్రతినిధి):

మహాదేవపూర్‌లో నవంబర్ 11న నేతకాని సంఘం సమావేశం జరిగింది. నేతకాని మండల అధ్యక్షుడు గోగుల నాగేందర్ సమావేశంలో పలు డిమాండ్లు చేశారు. నేతకాని కులస్తులకు ఎస్సీ రిజర్వేషన్లలో పూర్తి న్యాయం చేయాలని కోరారు. ఎస్సీ రిజర్వేషన్ల ప్రక్రియలో నేతకాని కులస్తులకు తీవ్రమైన నష్టం జరుగుతోందని నాగేందర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నేతకానివారికి ప్రత్యేక గ్రూప్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తగిన రిజర్వేషన్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణలో మాల, మాదిగల తర్వాత నేతకానివారిదే అత్యధిక జనాభా అని నాగేందర్ చెప్పారు. నేతకాని కులం రాష్ట్రంలో మూడవ స్థానంలో ఉందని ఆయన తెలిపారు. జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లలో న్యాయం కావాలని అన్నారు. మారుమూల ప్రాంతాల్లో నివసించే నేతకాని పేదలకు పోడు భూములున్నాయి. ఆ భూములకు ప్రభుత్వం వెంటనే పట్టాలు మంజూరు చేయాలని నాగేందర్ కోరారు. పోడు భూముల సమస్యపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. నేతకాని సంఘం ఈ నెల 15న మహాసభ నిర్వహించనుంది. మహాసభను విజయవంతం చేయడానికి అందరూ ముందుకు రావాలని నాగేందర్ పిలుపునిచ్చారు. రాజకీయాలకు అతీతంగా నేతకాని బాంధవులు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో నేతకాని సంఘం మండల నాయకులు పాల్గొన్నారు. రమేష్, రాజు సమావేశానికి హాజరయ్యారు. తిరుపతి తదితర నేతకాని నాయకులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. నేతకాని సంఘం ఆధ్వర్యంలో మహాదేవపూర్ మండల కేంద్రంలో సమావేశం జరిగింది. సమావేశంలో రిజర్వేషన్లు, పోడు భూముల పట్టాలపై డిమాండ్లు వినిపించాయి.

విద్యతోనే సమాజ అభ్యున్నతి, దేశ ప్రగతి

- విద్యార్థులు ఆజాద్ ఆశయాలు అనుసరించాలి

నర్సంపేట వుదయం ప్రతినిధి నవంబర్ 11.



నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నవంబర్ 11న జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని కార్యక్రమం జరిగింది. కళాశాల (అటానమస్) ప్రాంగణంలో వేడుకలు ఘనంగా సాగాయి. ఆజాద్ భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా సేవలందించారు. భారత విద్యావ్యవస్థ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. ఆజాద్‌కు భారతరత్న పురస్కారం లభించింది. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ విద్య ప్రాధాన్యాన్ని వివరించారు. విద్య వ్యక్తిగత అభివృద్ధికే కాకుండా సమాజ అభ్యున్నతికి పునాది అన్నారు. దేశ ప్రగతికి విద్య బలమైన ఆధారమని పేర్కొన్నారు. విద్యార్థులు డిగ్రీలకే పరిమితం కాకూడదని మల్లం నవీన్ సూచించారు. నైతిక విలువలు, సామాజిక బాధ్యత పెంపొందించుకోవాలని చెప్పారు. శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మక ఆలోచనలను అభివృద్ధి చేయాలని కోరారు. రాజనీతి శాస్త్ర విభాగ ఇన్‌చార్జి ఎస్. కమలాకర్ ఆజాద్ కృషిని వివరించారు. స్వాతంత్ర్యానంతరం ఆధునిక విద్యావ్యవస్థ నిర్మాణానికి ఆజాద్ విశేషంగా కృషి చేశారని తెలిపారు. విద్య అందరికీ అందుబాటులో ఉండాలని ఆయన విశ్వసించారని చెప్పారు. సామాజిక, ఆర్థిక అసమానతల నిర్మూలనకు విద్య ప్రధాన సాధనమని కమలాకర్ వివరించారు. విద్యార్థులు ఆజాద్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. జ్ఞానం పెంపొందించుకుంటూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. విద్యతో సమాజంలో సమానత్వం, సాధికారత బలోపేతమవుతాయని వక్తలు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలు కూడా విద్య ద్వారా బలపడతాయని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెలుగు రేఖ గ్రామ సంఘం భవన నిర్మాణానికి భూమి పూజ

- ఉప సర్పంచ్ గడ్డం రాజు గౌడ్ పాల్గొన్నారు



మహాదేవపూర్ , నవంబర్ 11 (వుదయం ప్రతినిధి):

మహాదేవపూర్ మండలం పెద్దంపేటలో వెలుగు రేఖ గ్రామ సంఘం భవనానికి భూమి పూజ జరిగింది. నవంబర్ 11న జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బీసుల లావణ్య రాజేష్ పాల్గొన్నారు. నూతన భవన నిర్మాణం కోసం ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఏబీఎన్ రాజన్న ఆధ్వర్యంలో భవన నిర్మాణానికి ఏర్పాట్లు జరిగాయి. గ్రామ సర్పంచ్ లావణ్య రాజేష్ ముఖ్య అతిథిగా హాజరై భూమి పూజ ప్రారంభించారు. పెద్దంపేట గ్రామంలోనే నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.

కార్యక్రమంలో ఉప సర్పంచ్ గడ్డం రాజు గౌడ్ పాల్గొన్నారు. వార్డు సభ్యులు చిదం సంజీవ్, కుర్సాం మంజుల హాజరయ్యారు. వార్డు సభ్యులు తడండ్ల మాళవిక, గౌరివేణి మల్లేశ్వరి కూడా పాల్గొన్నారు.

గోగు అశోక్, దుర్గం సమ్మక్క, కుర్సం లక్ష్మణ్ కార్యక్రమానికి వచ్చారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు గావిడి బాపు హాజరయ్యారు. పంచాయతీ కార్యదర్శి సమ్మయ్య కూడా పాల్గొన్నారు.

సీనియర్ మేటు సుజాత కార్యక్రమంలో పాల్గొన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు బిక్షపతి, సునీత, సువర్ణ హాజరయ్యారు. గ్రామ సంఘం అధ్యక్షురాలు కుర్సం ఉమారాణి పాల్గొన్నారు.

రవనీల, సీసీ కొమరయ్య కార్యక్రమానికి హాజరయ్యారు. గ్రామ సంఘం విఓఏ మధుసక్కతోపాటు సభ్యులందరూ పాల్గొన్నారు. భవన నిర్మాణం కోసం భూమి పూజ పూర్తయింది. రావనీల కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆజాద్ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి

నర్సంపేట వుదయం ప్రతినిధి నవంబర్ 11.



వరంగల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జావిద్ ఆజాద్ జీవితచరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని కోరారు. విద్యార్థులకు ఆజాద్ దేశసేవలు తెలిసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విజ్ఞప్తిని తెలంగాణ జన సమితి తరపున చేశారు. నవంబర్ 11న జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించాలని ప్రభుత్వాలు ప్రకటించాయి. అదే రోజున మైనారిటీ సంక్షేమ దినోత్సవం నిర్వహించాలని కూడా ప్రకటించాయి. అయినా అధికారికంగా వేడుకలు నిర్వహించడం లేదని షేక్ జావిద్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఆజాద్ జయంతిని ఘనంగా నిర్వహించాలని ఆయన కోరారు. ప్రైవేటు విద్యాసంస్థలు కూడా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యాలయాల్లోనూ జయంతి వేడుకలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. 1888 నవంబర్ 11న మక్కాలో ఆజాద్ జన్మించారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు. పండితుడు, రచయిత, పాత్రికేయుడిగానూ ఆజాద్ విశేష ఖ్యాతి పొందారు. భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా ఆజాద్ సేవలందించారు. విద్యారంగ అభివృద్ధికి ఆయన ఎనలేని కృషి చేశారని షేక్ జావిద్ తెలిపారు. ఆజాద్ సేవలను పాఠ్యాంశాల ద్వారా విద్యార్థులకు వివరించాలని కోరారు. హిందూ, ముస్లింలు ఐక్యంగా జీవించాలని ఆజాద్ నమ్మేవారు. మతసామరస్యం దేశ అభివృద్ధికి అవసరమని ఆయన భావించారు. జాతీయ ఐక్యతతోనే దేశ అభివృద్ధి సాధ్యమని ఆజాద్ విశ్వసించారు. ఆజాద్ ఆశయాలు, సేవలను భావితరాలకు తెలియజేయాలని షేక్ జావిద్ కోరారు. ఆయన జీవితచరిత్రను పాఠ్యపుస్తకాల్లో తిరిగి చేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

మొక్కజొన్న సాగులో నూతన ఆవిష్కరణలకు సింజెంటా ప్రాధాన్యం



హైదరాబాద్లో నవంబర్ 2 నుంచి 4 వరకు అంతర్జాతీయ మొక్కజొన్న సదస్సు జరిగింది. సింజెంటా సదస్సులో నూతన సాంకేతికతలు, ఆవిష్కరణలను ప్రదర్శించింది.

ఉత్పాదకత పెంపు, పంటల సంరక్షణకు సహకారం అవసరమని సంస్థ పేర్కొంది. సుస్థిర వ్యవసాయ పద్ధతులపైనా అంతర్జాతీయ భాగస్వామ్యం కావాలని తెలిపింది.

హైదరాబాద్లో జరిగిన తొలి అంతర్జాతీయ మొక్కజొన్న సదస్సు (ఐఎంసీ)2026లో ఈ ప్రదర్శన జరిగింది. ప్రపంచ మొక్కజొన్న ఉత్పత్తిలో భారత్ ఐదో స్థానంలో ఉంది.

సాగు విస్తీర్ణంలో భారత్ నాలుగో స్థానాన్ని ఆక్రమించింది. ఆహారం, పశువుల దాణా, ఇంధనం, పారిశ్రామిక అవసరాల్లో మొక్కజొన్న ప్రాధాన్యాన్ని సదస్సు చర్చించింది.

సింజెంటా టీవైఎమ్ఐఆర్ఐయూఎమ్® సాంకేతికతతో రూపొందించిన వీఐసీటీఆర్ఏటీఓ® విత్తన శుద్ధి ఉత్పత్తిని ప్రదర్శించింది. నులిపురుగులు, వివిధ తెగుళ్ల నుంచి పంటకు రక్షణ కల్పిస్తుందని సంస్థ తెలిపింది.

భూమి లోపల, పైన పంటను కాపాడుతుందని వివరించింది. మొలకెత్తడం నుంచి కోత వరకు పంట ఎదుగుదలకు వీఐసీటీఆర్ఏటీఓ® తోడ్పడుతుందని సింజెంటా పేర్కొంది.

సింజెంటా ఏఎమ్ఈఏ సీడ్‌కేర్, బయోలాజికల్స్ విభాగం అధిపతి రవి చౌహాన్ విత్తనం నుంచే ఉత్పాదకత మొదలవుతుందని అన్నారు. కీలక దశల్లో రక్షణతో రైతులు ఆశించిన దిగుబడిని పొందవచ్చని చెప్పారు.

సింజెంటా సస్టైనబిలిటీ అండ్ కార్పొరేట్ అఫైర్స్ విభాగం అధిపతి డాక్టర్ సంగీతా దావర్ సహకారాన్ని ప్రాధాన్యంగా పేర్కొన్నారు. రైతులు, పరిశోధనా సంస్థలు, ప్రభుత్వాలు, పరిశ్రమలు కలిసి పనిచేస్తేనే స్థిరమైన అభివృద్ధి సాధ్యమని తెలిపారు.

సదస్సులో డాక్టర్ ఎన్. లక్ష్మీపతి, వి. సిద్ధేష్ కూడా ప్రసంగించారు.

టీఆర్పీ భూపాలపల్లి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా మామిడి శ్రీకాంత్ నియామకం



- యువతను పార్టీలోకి నడిపించాలి

భూపాలపల్లి నవంబర్ 11 వుదయం ప్రతినిధి.

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ యువజన విభాగం అధ్యక్షుడిగా మామిడి శ్రీకాంత్ నియమితులయ్యారు. నవంబర్ 11న ఈ నియామకం జరిగినట్లు సమాచారం. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న శ్రీకాంత్‌కు నియామక పత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ చేసిన సూచన మేరకు నియామక ప్రక్రియ చేపట్టారు. తీన్మార్ మల్లన్న స్వయంగా పత్రాన్ని అందజేయడంతో బాధ్యత అప్పగింత పూర్తయింది. తన పుట్టినరోజున పదవి దక్కడం సంతోషంగా ఉందని శ్రీకాంత్ తెలిపారు. రవి పటేల్ యువతపై పార్టీ దృష్టిని స్పష్టం చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో యువతను పెద్ద సంఖ్యలో పార్టీవైపు నడిపించాలని సూచించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని కోరారు. పార్టీ ఆశయాలు, సిద్ధాంతాల కోసం యువత క్రియాశీలంగా ఉండాలని రవి పటేల్ అన్నారు. నూతన అధ్యక్షుడు శ్రీకాంత్ బాధ్యత అప్పగించిన నేతలకు ధన్యవాదాలు తెలిపారు. తీన్మార్ మల్లన్న, రవి పటేల్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు. జిల్లా, మండల, గ్రామస్థాయి నాయకులకు శ్రీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు. క్షేత్రస్థాయిలో యువతను పెద్ద సంఖ్యలో పార్టీలోకి తీసుకువస్తానని ప్రకటించారు. అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని చెప్పారు. పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తానని శ్రీకాంత్ తెలిపారు. ప్రజల మధ్య నిరంతరం ఉంటూ క్రియాశీలకంగా పనిచేస్తానన్నారు. యువతను సంఘటితం చేయడంపై ఆయన దృష్టి పెట్టారు. నూతన బాధ్యతతో శ్రీకాంత్ జిల్లా యువజన విభాగానికి నాయకత్వం వహించనున్నారు. నియామక ప్రక్రియలో రవి పటేల్ సూచన కీలకంగా నిలిచింది. నియామక పత్రం అందజేసిన తీన్మార్ మల్లన్న నిర్ణయాన్ని అధికారికం చేశారు.

కార్తీక మాసంలో శైవ క్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

నర్సంపేట వుదయం ప్రతినిధి నవంబర్ 11.



నర్సంపేటలో కార్తీక మాస యాత్రలకు ప్రత్యేక బస్సులు నడవనున్నాయి. అరుణాచలం, శ్రీశైలం, శబరిమల యాత్రలకు ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుంది. నర్సంపేట ఆర్టీసీ డిపో ఈ బస్సులను అద్దె ప్రాతిపదికన ఏర్పాటు చేయనుంది. డిపో మేనేజర్ ఎం. సరస్వతి ఈ వివరాలను నవంబర్ 11న తెలిపారు.

ప్రముఖ పంచారామ శైవ క్షేత్రాలకు కూడా బస్సులు నడపనున్నట్లు ఆమె పేర్కొన్నారు. యాత్రికుల అవసరాలకు అనుగుణంగా ఈ ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. అమరావతిలోని అమరలింగేశ్వర స్వామి ఆలయం పంచారామ క్షేత్రాల్లో ఒకటి. భీమవరంలోని సోమేశ్వర స్వామి ఆలయానికి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయనున్నారు.

పాలకొల్లులోని క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయానికీ బస్సు నడపనున్నారు. సామర్లకోటలోని కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయం కూడా జాబితాలో ఉంది. ద్రాక్షారామంలోని భీమేశ్వర స్వామి ఆలయానికి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయనున్నారు. ఈ ఐదు క్షేత్రాలకు పంచారామ యాత్రలో భాగంగా బస్సులు నడుస్తాయి.

నర్సంపేటతో పాటు పరిసర ప్రాంతాల భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సరస్వతి కోరారు. యాత్రల పూర్తి వివరాలు డిపో అధికారుల నుంచి తెలుసుకోవచ్చు. ముందస్తు బుకింగ్ సౌకర్యం కూడా అందుబాటులో ఉంటుంది. బుకింగ్ కోసం 9959226052, 9704644543 నంబర్లను సంప్రదించాలి.

7382856034 నంబర్‌కు కూడా భక్తులు ఫోన్ చేయాలని సరస్వతి సూచించారు.

ప్రపంచాన్ని శాసించేలా విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

- 105 యంగ్ ఇండియా పాఠశాలలు నిర్మాణం



హనుమకొండ, నవంబర్ 11 (వుదయం ప్రతినిధి) :

నవంబర్ 11న హనుమకొండలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. కాజీపేట ప్రభుత్వ బాలుర పాఠశాలలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణం జరగనుంది.

వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో ఈ పాఠశాల ఏర్పాటవుతుంది. ప్రతి బిడ్డ ఉన్నత విద్య అభ్యసించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన చెప్పారు.

ప్రతి నియోజకవర్గానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేస్తామని భట్టి తెలిపారు. ప్రీ ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు సెమీ రెసిడెన్షియల్ విధానం ఉంటుంది.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ పిల్లలకు ఇంగ్లిష్ మీడియంలో విద్య అందుతుంది. రవాణా, పుస్తకాలు, యూనిఫామ్, నోట్‌బుక్స్, బ్యాగులు ఉచితంగా ఇస్తారు.

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ప్రభుత్వం అందుబాటులోకి తెస్తుంది. దేశంలో ఎక్కడా లేని అంతర్జాతీయ ప్రమాణాలతో 105 పాఠశాలలు నిర్మించనుంది.

ఒక్కో పాఠశాలకు 20 నుంచి 25 ఎకరాల స్థలం అవసరమవుతుంది. ఈ పథకానికి రూ.200 కోట్ల వ్యయం కానుంది.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పోషకాహారం అందిస్తామని భట్టి చెప్పారు. రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు అల్పాహారం అందుతుంది.

ఉదయం 8:30 నుంచి 9:30 గంటల మధ్య ఒకేసారి భోజనం ఇస్తారు. ఈ కార్యక్రమం ప్రపంచంలోనే ప్రత్యేకమని ఆయన పేర్కొన్నారు.

కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య కూడా హాజరయ్యారు.

ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. ముందుగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పించారు.

అనంతరం భట్టి పాఠశాల నిర్మాణ మ్యాపులను పరిశీలించారు. సభలో ప్రభుత్వ విద్యా లక్ష్యాలను ఆయన వివరించారు.

హనుమకొండ, కాజీపేట అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాజన్న సిరిసిల్ల రాజయ్యతో పాటు జిల్లా అధికారులు కార్యక్రమానికి హాజరయ్యారు.

30 రోజులుగా నిరువధిక నిరసన ఎన్ఎంహెచ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్.
- ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని జక్కు రాజు గౌడ్ కోరారు.



ధర్మసాగర్ నవంబర్ 11 (వుదయం ప్రతినిధి)

హనుమకొండలో జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల నిరసనకు మద్దతు పెరిగింది. గత 30 రోజులుగా ఉద్యోగులు నిరవధిక నిరసన దీక్షలు చేస్తున్నారు. వైద్య ఆరోగ్య కార్యాలయాలు, కలెక్టరేట్‌ల ముందు ఆందోళన కొనసాగుతోంది. తెలంగాణలోని సుమారు 17 వేల మంది ఉద్యోగులు ఈ నిరసనలో ఉన్నారు. మొత్తం 78 క్యాడర్లు సమస్యల పరిష్కారం కోరుతున్నారు. అధికారుల స్పందన లేకపోవడంపై జక్కు రాజు గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నవంబర్ 11న హనుమకొండ కలెక్టరేట్ ముందు ధర్నా శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, శాశ్వత ఉద్యోగాలుగా మార్చాలని డిమాండ్ చేశారు. వేతనాలు పెంచాలని కూడా జక్కు రాజు గౌడ్ కోరారు. ఉద్యోగులకు 180 రోజుల ప్రసూతి సెలవులు ఇవ్వాలని సంఘాలు కోరుతున్నాయి. గత మూడు నెలలుగా నిలిచిన వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇవన్నీ న్యాయబద్ధమైన డిమాండ్లని జక్కు రాజు గౌడ్ తెలిపారు.

డిమాండ్లు పరిష్కరించకపోతే సమ్మె చేపడతామని ఆయన హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏఐటీయూసీ ప్రత్యేక మద్దతుతో పోరాటం చేస్తుందని ప్రకటించారు. వైద్యాధికారులు, వైద్యశాఖ మంత్రి, రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు పాల్గొన్నారు. మొత్తం 300 మంది హాజరయ్యారు.

నూతన వదు వరులని ఆశీర్వధించిన ఎమ్మెల్యే దొంతి



చెన్నారావు పేట మండలం

చెన్నారావుపేటలో నవంబర్ 11న నూతన దంపతులకు ఎమ్మెల్యేలు ఆశీర్వాదం అందించారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి వేదుకకు హాజరయ్యారు.

వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజుతో కలిసి దంపతులను ఆశీర్వదించారు. సూర్యాపేట తండాకు చెందిన మాజీ ఎంపీపీ దారావత్ అమ్మి, రఘు దంపతుల కుమారుడు రాజ్‌కుమార్ వివాహం జరిగింది.

శ్రీ చామంతితో రాజ్‌కుమార్ వివాహ వేదుక చెన్నారావుపేట మండలంలో జరిగింది. వేదుకలో ఎమ్మెల్యేలు నూతన జంటను కలిసి ఆశీర్వదించారు.

వివాహ వేదుకకు హాజరైన దొంతి మాధవరెడ్డి, కే.ఆర్. నాగరాజు నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వేదుకకు వచ్చిన అతిథులు నూతన జంటను అభినందించారు. చెన్నారావుపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సిద్దన రమేష్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సొసైటీ చైర్మన్ మొగిలి వెంకట్‌రెడ్డి కూడా హాజరయ్యారు. సర్పంచ్ దార రంజిత్ వేదుకలో పాల్గొన్నారు.

ఉపసర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కార్యక్రమానికి హాజరయ్యారు. యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీష్ పాల్గొన్నారు.

పాసాన్ మున్సిపాలిటీలో అజయ్ యాదవ్ ఉపాధ్యక్ష పదవి ఖాళీ

విశేష ప్రతినిధి విశేష నివేదిక



అనూప్‌పూర్ జిల్లా పాసాన్ మున్సిపాలిటీలో అవిశ్వాస తీర్మానం ఆమోదమైంది. ఉపాధ్యక్షుడు అజయ్ యాదవ్‌పై తీర్మానానికి 14 మంది కౌన్సిలర్లు మద్దతు తెలిపారు. 4 మంది కౌన్సిలర్లు తీర్మానాన్ని వ్యతిరేకించారు. బుధవారం జరిగిన ఓటింగ్‌తో అజయ్ యాదవ్ ఉపాధ్యక్ష పదవి నుంచి తప్పుకున్నారు. పాసాన్ మున్సిపాలిటీలో మొత్తం 18 వార్డులు ఉన్నాయి.

